# మన జనప్రగతి

తెలుగు దినపత్రిక

నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం

సంపుటి : 6 సంచిక : 154 పేజీలు : 8 వెల : రూ.2/- మంగళవారం 30 జూన్ 2026 వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


## గ్రామీణాభివృద్ధిలో ఎపి ముందంజ

- కితాబునిచ్చిన శివరాజ్ సింగ్ చౌహాన్




## ముంబై చేరుకున్న పవన్ కళ్యాణ్

**అమరావతి,మన జనప్రగతి జూన్ 29:** జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ముంబయి చేరుకున్నారు. గత కొంతకాలంగా భుజాలకి సంబంధించిన రొటేటర్ కఫ్ గాయం, రెండు భుజాలకి చెందిన కండరాలు పూర్తిగా చిట్లడంతో ఆయన ఇబ్బందిపడుతున్నారు. మిగతా2లో...





## అయోధ్య రామాలయ నిధుల దుర్వినియోగం

**అత్యవసర విచారణకు సుప్రీం తిరస్కరణ**

**అంత తొందరెందుకని పిటిషన్‌కు ధర్మాసనం ప్రశ్న**

**న్యూఢిల్లీ,మన జనప్రగతి జూన్ 29:** అయోధ్య రామాలయంలో విరాళాల దుర్వినియోగం వ్యవహారం సుప్రీం కోర్టుకు చేరింది. ఈ ఆరోపణలపై నిష్పాక్షిక విచారణ జరిపించాలని కోరుతూ అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. సీబీఐ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని మిగతా2లో...

## దేశం గర్వించే రాజధాని నగరంగా

# అమరావతి

## - హైదరాబాద్ ప్లస్‌గా అమరావతి నిర్మాణం జరగాలి

- రాజధాని నిర్మాణ పనుల్లో మరింత వేగం పెంచాలి
- ప్రారంభానికి ప్రధాని మోడీకి ఆహ్వానం
- నిర్మాణ సంస్థలతో సిఎం చంద్రబాబు సమీక్ష

**అమరావతి,మన జనప్రగతి జూన్ 29:** యావత్ దేశం గర్వించే రాజధాని నగరంగా అమరావతిని నిర్మిస్తున్నామని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. హైదరాబాద్ ప్లస్‌గా అమరావతి నిర్మాణం జరగాలని అన్నారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ నగర నిర్మాణంలో కాంట్రాక్టు సంస్థలు కూడా భాగస్వాములు కావాలని సీఎం పిలుపునిచ్చారు. రాజధాని నిర్మాణ పనుల్లో మిగతా2లో...






## ఘనంగా సీషెల్స్ 50వ స్వాతంత్ర్య దినోత్సవం

**ఉత్సవాల్లో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోడీ**

**విక్టోరియా,మన జనప్రగతి జూన్ 29:** భారత్–సీషెల్స్ మధ్య ఉన్న చిరకాల స్నేహబంధానికి అద్దం పట్టేలా సీషెల్స్ 50వ స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా జరుగుతోంది. మూడు రోజుల అధికారిక పర్యటనలో భాగంగా సీషెల్స్‌కు వెళ్లిన ప్రధాని నరేంద్ర మోదీ.. ఆ దేశ జాతీయ దినోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మిగతా2లో...

## ప్రతిభ కనబర్చిన విద్యార్థులే బ్రాండ్ అంబాసిడర్లు

- షైనింగ్ స్టార్స్' సత్కార కార్యక్రమంలో మంత్రి లోకేశ్
- టెన్త్, ఇంటర్ షైనింగ్ స్టార్లకు నగదు పురస్కారాలు అందచేత



**అమరావతి,మన జనప్రగతి జూన్ 29:** ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులే విద్యా వ్యవస్థకు బ్రాండ్ అంబాసిడర్లని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. అమరావతిలో నిర్వహించిన 'షైనింగ్ స్టార్స్' సత్కార కార్యక్రమంలో ఆయన పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పదో తరగతి 55 మందికి రూ.30 వేల నగదు బహుమతి, మెడల్, ప్రశంసాపత్రం అందజేశారు. అలాగే ఇంటర్మీడియట్‌లో ప్రతిభ చూపిన 61 మంది విద్యార్థులకు స్టార్స్‌కు ల్యాప్‌టాప్‌లు, మెడల్స్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ మిగతా2లో...

## వ్యవసాయ రంగాన్ని సర్వనాశనం చేసిన వైసిపి

- రైతులు ఎరువుల, పురుగు మందులు తగ్గించాలి
- భూసారం దెబ్బతినకుండా ఉద్యాన పంటలు వేయాలి
- ఏరువాక కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడు






## అమరావతిలో అల్లర్లకు వైసిపి కుట్రలు

- జగన్ డైరెక్షన్‌లోనే ఈ అలజడులు
- మండిపడ్డ మంత్రి కొల్లు రవీంద్ర

**మచిలీపట్నం,మన జనప్రగతి జూన్ 29:** జగన్ డైరెక్షన్‌లోనే అమరావతిలో వైసీపీ అల్లర్లు అంటూ మంత్రి కొల్లు రవీంద్ర వ్యాఖ్యానించారు. ప్రశాంతంగా ఉన్న అమరావతి రైతుల్లో అలజడులు సృష్టించేలా వైసీపీ నేతలు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రెండు రోజుల క్రితం అమరావతిలో జరిగిన అల్లర్లపై మంత్రి కొల్లు రవీంద్ర మిగతా2లో...

## కోవిడ్ తరవాత పెరిగిన సైబర్ నేరాలు

- మోసపోతున్న వారిలో చదువుకున్నవారే ఎక్కువ
- సైబర్ క్రైమ్స్ నివారణ్ ఆధునిక టెక్నాలజీ వినియోగం
- సైబర్ క్రైమ్స్ రికవరీ మేళాలో హోంమంత్రి అనిత




**విశాఖపట్నం,మన జనప్రగతి జూన్ 29:** కొవిడ్ తర్వాత సైబర్ నేరాలు పెరిగాయని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు. ఎన్డీఏ ప్రభుత్వం సైబర్ క్రైమ్‌పై దృష్టి పెట్టిందని పేర్కొన్నారు. సైబర్ నేరాలపై ఉక్కుపాదం మోపుతున్నామని హెచ్చరించారు. సైబర్ క్రైమ్స్ పోలీసుస్టేషన్‌కు టూల్స్ ఇస్తున్నామని చెప్పుకొచ్చారు. విశాఖపట్నం పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం సైబర్ క్రైమ్స్ రికవరీ మేళా నిర్వహించారు. ఈ మేళాకు ముఖ్య అతిథిగా హోం మంత్రి అనిత పాల్గొనగా, సీపీ శంఖబ్రాత బాగ్చి, పోలీస్ అధికారులు హాజరయ్యారు. సైబర్ క్రైమ్ బాధితులకు రికవరీ చేసి చెక్కులను హోం మంత్రి అందజేశారు. చదువుకున్నవారే సైబర్ నేరాలకు గురవుతున్నారని మిగతా2లో...

## జీవితం అంటే వందమీటర్ల పరుగుపందెం కాదు

**ఓపిక, నిలకడ శక్తితో చేపట్టిన పనులు పూర్తి చేయాలి**

- వీబీఐటీలో వికసిత్ భారత్ స్టూడెంట్స్ కాంక్లేవ్‌లో నితిన్ నబీ
- వర్చువల్‌గా పలు జిల్లాల కార్యాలయాలు ప్రారంభం
- తెలంగాణలో బిజెపి అధికారానికి ఎంతో దూరం లేదని వ్యాఖ్య



**హైదరాబాద్,మన జనప్రగతి జూన్ 29:** జీవితం వంద మీటర్ల పరుగుపందెం కాదని.. మన ఓపికకు పరీక్ష అని భాజపా జాతీయాధ్యక్షుడు నితిన్ నబీన్ అన్నారు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ వీబీఐటీ క్యాంపస్‌లో వికసిత్ భారత్ స్టూడెంట్స్ కాంక్లేవ్‌లో ఆయన పాల్గొన్నారు. భాజపా యువ మోర్చా ఆధ్వర్యంలో దీనిని నిర్వహించారు. రాజకీయాల్లో ఎలాంటి సవాళ్లు ఎదుర్కొన్నారని ఓ విద్యార్థి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. చిన్న వయసులోనే అనుకోకుండా రాజకీయాల్లోకి మిగతా2లో...

## సర్ ప్రక్రియ సజావుగా సాగాలి

**బిఎల్‌వోలు నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలి**

**కలెక్టర్లకు ఎన్నికల అధికారి ఆదేశం**



మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం

30 - 06 - 2026

# దేశం గర్వించే రాజధాని నగరంగా అమరావతి

(మొదటి పేజీ తరువాయి)

మరింత వేగం పెంచాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. అమరావతిలో నిర్మాణ పనుల పురోగతిపై సచివాలయంలో కాంట్రాక్టు సంస్థలతో సీఎం సమీక్ష నిర్వహించారు. నిర్దేశిత గడువు కంటే ముందే నిర్మాణ పనులు పూర్తి చేయాలని సూచనలు ఇచ్చారు. ప్రస్తుతం రూ.50,999 కోట్ల విలువైన పనులు కాంట్రాక్టు సంస్థలకు అప్పగించామని అధికారులు వివరించారు. హౌసింగ్, ట్రంక్ ఇన్ ఫ్రా, ఎల్పీఎస్ ఇన్ ఫ్రా, సహా అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ టవర్ల లాంటి ఐకానిక్ భవనాల నిర్మాణ ప్రాజెక్టులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. పనులు వేగంగా చేసేందుకు అవసరమైన మానవ వనరులు, యంత్రాలు ఇతర సామాగ్రిని ముందుగానే సిద్ధం చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. ప్రస్తుతం 26,924 మంది కార్మికులు, 5140కి పైగా భారీ యంత్రాలు నిర్మాణ పనుల్లో నిమగ్నమైనట్టు మంత్రి నారాయణ సీఎంకు వివరించారు. నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకమూ లేకుండా కొండవీటి వాగు, పాలవాగు ప్రవాహాలు సజావుగా సాగేందుకు వీలుగా వాటిని వెడల్పు చేస్తున్నామని మంత్రి తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం.. భవిష్యత్ నగరంగా నిర్మిస్తు?న్న అమరావతి నిర్మాణంలో పని చేశామన్న బ్రాండ్ ను కాంట్రాక్టర్లు సంపాదించేలా పనులు చేపట్టాలని సూచించారు. కొందరు వ్యక్తులు కావాలని లిటిగెంట్లుగా మారి రాజధాని పనుల్ని అడ్డుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారని.. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు వెళ్లాలని సీఎం స్పష్టం చేశారు. కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శుల నివాసాలు, రహదారులు, మౌలిక సదుపాయాలతో పాటు అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ టవర్ల నిర్మాణాలపై ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. దేశవ్యాప్తంగా వివిధ పుణ్య క్షేత్రాలు, నదుల నుంచి పవిత్రమైన మట్టి, నీళ్లు తీసుకువచ్చి ఈ ప్రాంతాన్ని పునీతం చేశామని.. గత పాలకులు ఐదేళ్ల పాటు రాజధాని నిర్మాణాన్ని ఆపేశారని సీఎం అన్నారు. గడచిన రెండేళ్లుగా అమరావతి నిర్మాణాన్ని మళ్లీ గాడిలో పెట్టామన్నారు. అత్యుత్తమ నివాసయోగ్య నగరంగా నిర్మాణం చేస్తున్న అమరావతిలో భాగస్వాములం అయ్యామన్న ఆలోచనతో కాంట్రాక్టు సంస్థలు పనిచేయాలని సీఎం సూచించారు. పనులు పూర్తి అయ్యాక రాజధాని నిర్మాణాల ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీని ఆహ్వానిస్తామని సీఎం తెలిపారు. నిర్మాణ పనుల వేగంతో పాటు నాణ్యత పై కూడా ఎక్కడా రాజీ లేకుండా చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ భవనాలు ఐకానిక్ నిర్మాణాలుగా ఉండాలని పేర్కొన్నారు. అమరావతికి పేరు తెచ్చేలా ఈ భవనాలను నిర్మించాలన్నారు. రాజధాని నిర్మాణంలో చిన్న ఇబ్బందులు కూడా లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ప్రతీ రెండు నెలలకు ఒకసారి నిర్మాణాల పురోగతిపై సమీక్షిస్తానని సీఎం స్పష్టం చేశారు. ఎల్ అండ్ టీ, షాపూర్ జీ పల్లోంజి, మెగా ఇంజినీరింగ్, ఎన్సీసీ, బీఎస్ఆర్, కేఎంవీ సహా వేర్వేరు కాంట్రాక్టు సంస్థలు చేపట్టిన పనులకు సంబంధించిన అంశాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయా సంస్థల ప్రతినిధులకు సీఎం దిశా నిర్దేశం చేశారు.

# ఘనంగా సీషెల్స్ 50వ స్వాతంత్ర్య దినోత్సవం

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం భారత ఆర్మీ, నౌకాదళ దళాలు కవాతు నిర్వహించగా.. వారికి గౌరవ సూచకంగా ప్రధాని మోదీ లేచి నిలబడటం కార్యక్రమానికి విశేషంగా నిలిచింది. రాజధాని విక్టోరియాలో నిర్వహించిన గో÷-డలెన్ జూబ్లీ పరేడ్‌లో భారత ఆర్మీకి చెందిన అస్సాం రెజిమెంట్ సైనికులు, భారత నౌకాదళానికి చెందిన సిబ్బంది కవాతు నిర్వహించి ఆకట్టుకున్నారు. ముఖ్యంగా అస్సాం రెజిమెంట్ జవాన్లు తమ ప్రసిద్ధ రెజిమెంటల్ గీతం 'బద్లు రామ్ కా బదన్' ఆలపిస్తూ మార్చ్ చేయడం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ వేడుకల్లో భారత నౌకాదళానికి చెందిన అత్యాధునిక స్టెల్త్ ఫ్రిగేట్ ఐఎన్ఎస్ తార్కష్, స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన ఐఎన్ఎస్ ఇక్షాక్ సర్వే నౌకలూ పాల్గొన్నాయి. దీంతో ఇరు దేశాల మధ్య రక్షణ సహకారం మరింత బలపడుతున్న సంకేతాలు స్పష్టం అయ్యాయి. ఈ సందర్భంగా భారత నౌకాదళం స్పందించింది. సీషెల్స్ జాతీయ దినోత్సవ స్వర్ణోత్సవాల్లో ఐఎన్ఎస్ తార్కష్, ఐఎన్ఎస్ ఇక్షాక్ నౌకలు, భారత నౌకాదళ బ్యాండ్, మార్చింగ్ కంటిం జెంట్ పాల్గొన్నాయని తెలిపింది. ఇది భారత్-సీషెల్స్ సముద్ర సహకారానికి ప్రతీకని పేర్కొంది. మరోవైపు, ఈ వేడుకల అనంతరం ప్రధాని మోదీ కూడా ఎక్స్‌లో స్పందించారు. ఈ సందర్భంగా సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినీ ఆతిథ్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 'అస్సాం రెజిమెంట్, భారత నౌకాదళ దళాలు సీషెల్స్ జాతీయ దినోత్సవ పరేడ్‌లో పాల్గొనడం ఇరు దేశాల మధ్య ఉన్న చిరస్థాయి స్నేహానికి మరో నిదర్శనం' అని ప్రధాని పేర్కొన్నారు. కాగా, ప్రధాని మోదీకి సీషెల్స్ అత్యున్నత పురస్కారం 'గార్డియన్ ఆఫ్ ది బ్లూ హారిజన్' లభించింది. దీనిని ఆ దేశ ప్రధాని ప్యాట్రిక్ హెర్మినీ.. భారత ప్రధానికి అందజేశారు.

# వ్యవసాయ రంగాన్ని సర్వనాశనం చేసిన వైసిపి

**గుంటూరు,మన జనప్రగతి జూన్ 29:**వ్యవసాయ రంగాన్ని వైసీపీ నాశనం చేసిందని.. ఇప్పుడు మళ్లీ ఏదేదో విమర్శలు చేస్తున్నారని మంత్రి అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. మామిడి, పొగాకు రైతులకు ధరల ఇబ్బంది లేకుండా చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఎరువులు, పురుగు మందులను రైతులు తక్కువగా వాడాలని సూచించారు. భూమి ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఏరువాక పౌర్ణమి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు 'ఏరువాక'ను ప్రారంభించారు. మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ హయాంలో వ్యవసాయానికి కనీస సహకారం లేదని.. విత్తనాల కంపెనీలకు కూడా బకాయిలు పెట్టి వెళ్లారని మండిపడ్డారు. కూటమి అధికారంలో వచ్చాక రాయితీపై రైతులకు విత్తనాలు ఇస్తున్నామన్నారు. ప్రత్యేక యాప్ ద్వారా ఎరువులను అందిస్తున్నామన్నారు. యాప్ ద్వారా 20 రోజుల్లో 11 లక్షల మంది రైతులు ఎరువులు తీసుకున్నారని తెలిపారు. వీరిలో మూడు లక్షల మందికి పైగా కౌలు రైతులు కూడా ఉన్నారన్నారు. రాష్ట్రంలో ఎక్కడా ఎరువుల కొరత లేదని స్పష్టం చేశారు. శాస్త్రవేత్తలు సూచించిన మేరకు మాత్రమే ఎరువులు వేయాలని అన్నారు. రైతులకు పచ్చిరొట్ట ఎరువుల కోసం రాయితీ ఇస్తున్నామన్నారు. మిర్చిలో పురుగు మందుల అవశేషాలు ఉన్నాయని చైనా మూడు కంటైనర్లు వెనక్కి పంపిందని.. ఈ విషయాన్ని రైతులు గమనించి పురుగు మందులు వాడకం తగ్గించాలని సూచించారు. వరిసాగును తగ్గించాలని చెప్పినా రైతులు పట్టించుకో వటం లేదని.. సరైన లాభాలు లేకపోయినా వరి వేసి నష్టాల పాలవుతున్నారని మంత్రి తెలిపారు. ఉద్యాన పంటలకు మంచి డిమాండ్ ఉందన్నారు. వ్యవసా యంలో 50 వేల కోట్ల ఆదాయం వస్తుంటే.. ఉద్యాన పంటలలో లక్షా 50 వేల కోట్ల ఆదాయం వస్తోందని తెలిపారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉంటుందని చెప్పారు. రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని సూచించారు. వర్జీనియా పొగాకు ధర సరిగా లేదని టోబాకో బోర్డు, వ్యాపారులతో మాట్లాడామన్నారు. కిలో రూ.200 కంటే తక్కువకు కొనడానికి వీల్లేదని చెప్పామని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర, బూర్ల రామాంజనేయులు, జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ధూళిపాళ్ల మాట్లాడుతూ.. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగానికి పెద్దపీట వేశారని తెలిపారు. అనేక రకాల పంటలకు గిట్టుబాటు ధర కల్పించారన్నారు. ఎరువులను ఇప్పుడు ఒక యాప్ ద్వారా అందిస్తున్నామని చెప్పారు. రైతుల కు 3 బస్తాల యూరియా ఇస్తే ఉపయోగకరంగా ఉంటుందన్నారు. 2.5 ఎకరానికి ఒక బస్తా డీఏపీ ఇస్తున్నారని.. అలా కాకుండా ఎకరానికి ఒక బస్తా ఇస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే ధూళిపాళ్ల సూచించారు. రైతులకు అన్నదాతా సుఖీభవ ద్వారా ఎంతో లబ్ధి చేకూరుతోందని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. రైతుల సంక్షేమం కోసం పని చేసే వ్యక్తి ముఖ్యమంత్రి అని ఎమ్మెల్యే కొనియాడారు.

# అయోధ్య రామాలయ నిధుల దుర్వినియోగం

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు చేయాలని పిటిషనర్ కోరారు. కోర్టు పర్యవేక్షణలో, నిర్ణీత కాలవ్యవధిలో దర్యాప్తు జరిగేలా ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థించారు. అయితే ఈ పిటిషన్ అత్యవసర విచారణకు సుప్రీం నిరాకరించింది. అయోధ్య రామమందిర విరాళాల నిధుల దుర్వినియోగం జరిగిందంటూ దాఖలైన పిటిషన్‌పై తక్షణ విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ వ్యవహారంపై సీబీఐతో స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని కోరుతూ పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే ఈ కేసులో వెంటనే విచారణ చేపట్టాల్సిన అత్యవసర పరిస్థితులు లేవని జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ షీల్ నాగు ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే, పిటిషనర్ తరఫు న్యాయవాది వాదిస్తూ, రామమందిర విరాళాల నిధుల వినియోగంలో అవకతవకలు జరిగాయని, ఈ వ్యవహారంపై సీబీఐతో స్వతంత్ర విచారణ జరిపించాలని కోర్టును కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అనుమానాలకు తావిస్తోందని, అందుకే స్వతంత్ర దర్యాప్తు అవసరమని ఆయన వాదించారు. ఇక, కేసు ఆలస్యమైతే ఎలక్ట్రానిక్ ఆధారాలు చెరిపివేసే అవకాశం ఉందని పిటిషనర్ తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కోర్టు, మెన్షన్ స్లిప్ సర్క్యులేట్ చేయాలని సూచించింది. అయితే ఈ కేసులో వెంటనే విచారణ చేపట్టాల్సిన అత్యవసర పరిస్థితులు లేవని జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ షీల్ నాగు ధర్మాసనం స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తిరిగి ప్రారంభమైన వెంటనే ఈ కేసును లిస్ట్ చేసి విచారణ చేపడతామని జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్ నేతృత్వంలోని ధర్మాసనం తెలిపింది. ప్రస్తుతం ఈ అంశంపై అత్యవసర విచారణ అవసరం లేదని స్పష్టం చేసింది. ఈలోపే మిన్ను విరిగి మీద పడదు.. అంత తొందరెందుక'ని పిటిషనర్‌ను ప్రశ్నించింది. మరోవైపు, ఈ కేసులో నిందితుల పక్షాన ఎవరూ వాదించొద్దని ÷జాబాద్ బార్ అసోసియేషన్ నిర్ణయించింది. 'ఈ కేసులో నిందితుల తరఫున ఎవరూ వాదించరు. ఒకవేళ ఎవరైనా అలా చేస్తే.. క్రమశిక్షణా చర్యలు ఎదుర్కోవలసి వస్తుంది. వారికి రూ.5లక్షలు జరిమానా విధిస్తాం' అని అసోసియేషన్ అధ్యక్షుడు కలికా ప్రసాద్ మిశ్రా మీడియాకు వెల్లడించారు. 2005లో కూడా అక్కడి న్యాయవాదులు ఇలాంటి నిర్ణయమే తీసుకున్నారు. ఆ ఏడాది రామ మందిరంపై దాడికి పాల్పడిన నిందితులను ఫైజజాబాద్ కోర్టు ముందు హాజరుపర్చగా.. వారి పక్షాన వాదించేందుకు ఎవరూ ముందుకురాలేదు.

# జీవితం అంటే వందమీటర్ల పరుగుపందెం కాదు

(మొదటి పేజీ తరువాయి)

వచ్చాను. రాజకీయాల్లోకి వచ్చాక నా భవిష్యత్తుపై గందరగోళంలో పడ్డాను. ఏ పని చేసినా నాదైన ముద్ర ఉండాలని గట్టిగా అనుకున్నాను. అప్పగించిన పనిని నిబద్ధతతో పూర్తి చేయడమే నా బలం. వేగంగా లక్ష్యాలు చేరాలనే ఆరాటంలో నేటి యువత ఉంది. ఏ పనినైనా ఓపిక, నిలకడ, శక్తితో చేసినప్పుడే ఫలితాలు వస్తాయని అన్నారు. ఇదిలావుంటే రంగారెడ్డి జిల్లా రూరల్ భారతీయ జనతా పార్టీ నూతన కార్యాలయాన్ని నితిన్ నబీన్ ఘనంగా ప్రారంభించారు. ఇదే సందర్భంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు వర్చువల్ విధానం ద్వారా మరో 9 జిల్లాల పార్టీ కార్యాలయాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో నితిన్ నబీన్ మాట్లాడుతూ.. నాటి నిజాం నిరంకుశ పాలన నుండి తెలంగాణకు విముక్తి కల్పించిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్‌కు, అలాగే ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. పార్లమెంట్‌లో నాడే తెలంగాణ వాణిని బలంగా వినిపించిన దివంగత నేత సుష్మా స్వరాజ్ సేవలను కూడా ఆయన ఈ సందర్భంగా స్మరించుకున్నారు. గతంలో దేశవ్యాప్తంగా బీజేపీ కేవలం రెండు లోక్‌సభ స్థానాలు గెలిచినప్పుడు.. అందులో ఒకటి తెలంగాణ నుంచేనని నితిన్ నబీన్ గుర్తుచేశారు. ఈ స్థాయికి చేరడానికి ఎంతో మంది పార్టీ కార్యకర్తలు తమ ప్రాణాలను త్యాగం చేశారని కొనియాడారు. తెలంగాణకు లీడర్లు ఎంతో దూరం లేరని, రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని ప్రతి మూలలోనూ కమలం వికసించి, భగవాధ్వజం ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై బీజేపీ కార్యకర్తలు రోడ్లపైకి వచ్చి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తారని, ప్రజావ్యతిరేక పద్ధతులను అవలంబిస్తున్న ఈ ప్రభుత్వాన్ని గద్దె దించుతారని హెచ్చరించారు. పశ్చిమ బెంగాల్‌లో ఎన్నో ఆటంకాలు ఎదురైనా తీవ్రంగా సంఘర్షణ చేసి ఎలాగైతే విజయం సాధించామో, తెలంగాణలోనూ అదే పునరావృతం అవుతుందన్నారు. బెంగాల్‌లో పార్టీని గెలిపించిన సునీల్ బన్సల్ ఇక్కడే ఉన్నారని, తెలంగాణలో కూడా అంతకన్నా ఎక్కువ కష్టపడి పార్టీని గెలిపించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆకాంక్షిస్తున్న 'వికసిత భారత్' లక్ష్యం సంపూర్ణంగా నెరవేరాలి అంటే తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని నితిన్ నబీన్ స్పష్టం చేశారు.

# గ్రామీణాభివృద్ధిలో ఏపి ముందంజ

**న్యూఢిల్లీ,మన జనప్రగతి జూన్ 29:** గ్రామీణాభివృద్ధిశాఖకు సంబంధించిన పలు కార్యక్రమాల అమలు అంశంలో ఏపీ పనితీరును కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రశంసించారు. దిల్లీలో నిర్వహించిన రాష్ట్రాల గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రులు, అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వీబీ-జీరామ్‌జీ రాష్ట్ర నోటిఫికేషన్ పూర్తి చేసిన రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందన్నారు. జూలై 2న తిరుపతి జిల్లా నుంచి వీబీ-జీరామ్‌జీ ప్రారంభోత్సవం చేయనున్నట్లు తెలిపారు. పీఎం గ్రామ సడక్ యోజన నాణ్యతలో దేశంలో అత్యుత్తమ రాష్ట్రాల్లో ఏపీ స్థానం దక్కించుకుందని చెప్పారు. గ్రామీణాభివృద్ధిలో రాష్ట్రాల సమన్వయంతోనే వికసిత్ భారత్ లక్ష్యం సాధ్యమన్నారు. పీఎంజీఎస్‌వైలో ఆమోదం పొందిన కొన్ని రహదారి పనులకు త్వరగా కాంట్రాక్టులకు ఇవ్వాలని శివరాజ్‌సింగ్ చౌహాన్ సూచించారు.

# ముంబై చేరుకున్న పవన్ కళ్యాణ్

(మొదటి పేజీ తరువాయి)

దీంతో వైద్య పరీక్షల నిమిత్తం ముంబయిలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆస్పత్రికి పవన్ వెళ్లనున్నారు. పవన్‌కల్యాణ్ వెంట ఆయన సతీమణి అన్నా కొణిదెల ఉన్నారు.

# ప్రతిభ కనబర్చిన విద్యార్థులే బ్రాండ్ అంబాసిడర్లు

(మొదటి పేజీ తరువాయి)

విద్యా విధానం గురించి చర్చ జరిగేలా సంస్కరణలు చేపట్టామని చెప్పారు. వచ్చే విద్యా సంవత్సరంలో ప్రైవేట్ పాఠశాలల నుంచి రెండు లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖలో పలు సంస్కరణలు చేపట్టామని, వాటి ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఉత్తీర్ణత శాతం పెరిగిందని తెలిపారు. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల కోసం ఎవరూ ముందుకు రాకపోయినా, ఇప్పుడు సీట్ల కోసం సిఫార్సులు వచ్చే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. విద్యా వ్యవస్థలో రాజకీయాలకు చోటు ఉండకూడదని నిర్ణయించామని, పాఠశాలల్లో రాజకీయ ప్రచారానికి అవకాశం ఇవ్వబోమని చెప్పారు. వ్యక్తిగత రాజకీయ ప్రయాణాన్ని ప్రస్తావి స్తూ, 2019లో మంగళగిరి నియోజకవర్గంలో 5,300 ఓట్ల తేడాతో ఓడిపోయానని, తొలి రోజు బాధ కలిగినా ఆ తర్వాత అదే తనలో మరింత కసిని పెంచిందని చెప్పారు. విద్యా రంగంలో మార్పు తీసుకురావడానికి రెండేళ్లు కష్టపడ్డానని, ఇప్పుడు ఆ ఫలితాలు కనిపిస్తున్నాయని లోకేష్ పేర్కొన్నారు.

# కోవిడ్ తరవాత పెరిగిన సైబర్ నేరాలు

(మొదటి పేజీ తరువాయి)

హోం మంత్రి అనిత చెప్పుకొచ్చారు. సైబర్ నేరాలకు గురైన 310 మందికి సుమారు ఆరు కోట్ల రూపాయలు రికవరీ చేసి అందించామని తెలిపారు. సైబర్ క్రైమ్‌లో టెక్నాలజీని పూర్తిగా వాడుతున్నామని వివరించారు. ప్రతి జిల్లాలో సైబర్ క్రైమ్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. సైబర్ క్రైమ్స్‌లో ఎవరైనా మోసపోతే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని హోం మంత్రి అనిత పేర్కొన్నారు. అలాగే సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లకు అత్యాధునిక సాంకేతిక పరికరాలను అందజేస్తున్నామని చెప్పారు. సైబర్ నేరాల దర్యాప్తులో టెక్నాలజీని పూర్తిస్థాయిలో వినియోగిస్తున్నామని తెలిపారు. సైబర్ నేరాలకు బాగా చదువుకున్నవారు కూడా బలవుతున్నారని హోంమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఇక, సైబర్ నేరాల నియంత్రణ లో ప్రజల అప్రమత్తత కూడా కీలకమని హోంమంత్రి అన్నారు. ప్రభుత్వం సైబర్ నేరాలపై ఉక్కుపాదం మోపుతుందని, నేరస్థులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజల సహకారంతో సైబర్ నేరాలను సమర్థవంతంగా అరికట్టగలమని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విశాఖ పోలీస్ కమిషనర్ శంఖ బ్రత బాగ్చి, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# అమరావతిలో అల్లర్లకు వైసిపి కుట్రలు

(మొదటి పేజీ తరువాయి)

స్పందించారు. ఈ సందర్భంగా మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి సంచలన ఆరోపణలు చేశారు. జగన్ మోహన్ రెడ్డి పూర్తిగా విజ్ఞత వదిలేశారన్నారు. అమరావతి పరిరక్షణ కమిటీ పేరుతో అమరావతిలో అశాంతి నెలకొల్పాలని వైసీపీ చూస్తోందని ఆరోపించారు. అమరావతిని వ్యతిరేకించిన వైసీపీ నేతలకు ఆ ప్రాంతంలో పర్యటించే హక్కు లేదని మంత్రి అన్నారు. పేర్ని నాని, అంబటి రాంబాబు పబ్లిక్‌గా బూతులు మాట్లాడి అక్కడి రైతుల్ని రెచ్చగొట్టారని తెలిపారు. నాడు మూడు రాజధానుల పేరుతో అమరావతి రైతుల్ని ఇబ్బందులు పెట్టారని.. దాడులు చేసి తీవ్రంగా కొట్టారని గుర్తుచేశారు. అధికారం పోయిన తర్వాత 'మావిగన్' అంటూ మరోసారి అమరావతిపై తమకున్న అక్కసును తీర్చుకుంటున్నారని విరుచుకుపడ్డారు. మళ్లీ ఇప్పుడు అమరావతి పరిరక్షణ కమిటీ పేరుతో కొత్త డ్రామాకు తెర లేపారన్నారు. వైసీపీ నేతలు తీరు మార్చుకోకపోతే రానున్న రోజుల్లో మరిన్ని అవమానాలు పడాల్సి వస్తుందని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు.

# సర్ ప్రక్రియ సజావుగా సాగాలి

- బిఎల్‌వోలు నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలి
- కలెక్టర్లకు ఎన్నికల అధికారి ఆదేశం

**హైదరాబాద్,మన జనప్రగతి జూన్ 29:**రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న సర్ పక్రియపై సోమవారం బిఆర్ కె భవన్ లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్ పక్రియ ప్రారంభమైన కేవలం నాలుగు రోజులలోనే దాదాపు 1.73 కోట్ల ఎన్యుమరేషన్ ఫారాలను ఇంటింటికి తిరిగి పంపిణీ చేయడంపై బూత్ స్థాయి అధికారులు, ఎన్నికల అధికారుల పనితీరు పట్ల సిఇఒ అభినందించారు. నిర్ణీత గడువులోగా 100శాతం ఎన్యుమరేషన్ ఫారాలను అందజేసేందుకు సంబంధిత జిల్లా స్థాయి అధికారులు బిఎల్ఓలను ప్రోత్సహించాలని సూచించారు.

బిఎల్‌వోలు తమ విధులను నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని, నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడినట్లయితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోబడతాయని ప్రధాన ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ-2026 కార్యక్రమంలో రాజకీయ పార్టీలు, బూత్ స్థాయి ఏజెంట్లు చురుకుగా పాల్గొని తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. ంఇఖీక్షలు, ఇఖీక్షలు విస్తృతంగా క్షేత్ర స్థాయిలో పర్యటనలు నిర్వహించి, అవసరమైన సూచనలు అందించి ప్రజలతో అనుసంధానం పెంచాలని, ఓటరు హెల్ప్‌లైన్ 1950, హెల్ప్‌డెస్క్ నంబర్లపై విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. ప్రతిరోజూ నిర్వహిస్తున్న ఓటరు అవగాహన కార్యక్రమాలను సమీక్షిస్తూ, సామాజిక మాధ్యమాల్లో క్రమం తప్పకుండా వివరాలను ప్రచురించాలని, అధికారుల క్షేత్ర పర్యటనలను సమగ్రంగా నమోదు చేయాలని సూచించారు. ఎన్యుమరేషన్ ఫారాలను సక్రమంగా నింపడంలో ఓటర్లకు సహాయపడే పక్రియను వేగవంతం చేసి లక్ష్యాలను సమర్థవంతంగా సాధించేలా ఃఒక్షలకు మరో విడత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారులను ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు. సమావేశంలో అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డా. వాసం వెంకటేశ్వర రెడ్డి, డిప్యూటీ ప్రధాన ఎన్నికల అధికారి జి.ఎస్. చారి, అన్ని నోడల్ అధికారులు, పీఎం సాంకేతిక అధికారులు పాల్గొన్నారు.

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం
30 - 06 - 2026

# విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం: జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

● ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 101 వినతులు స్వీకరణ



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూన్ 29:**-ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో స్వీకరించిన ప్రతి ఫిర్యాదుపై చట్ట ప్రకారం సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని కర్నూలు జిల్లా పోలీసు అధికారి విక్రాంత్ పాటిల్ తెలిపారు.సోమవారం కర్నూలు కొత్తపేటలోని కర్నూలు టూ టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులను జిల్లా ఎస్పీ స్వయంగా స్వీకరించి, ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ కార్యక్రమానికి మొత్తం 101 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. అందిన ప్రతి ఫిర్యాదును చట్టపరంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో విచారణ చేపట్టి, బాధితులకు న్యాయం జరిగేలా త్వరితగతిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు.ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీసు శాఖ ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఇస్తుందని, ఫిర్యాదుల పరిష్కారంలో పారదర్శకత, వేగం పాటించాలని సంబంధిత పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) హుస్సేన్ పీరా, సీఐలు శివశంకర్, ఇస్మాయిల్, మస్తాన్ వలి తదితరులు పాల్గొన్నారు.


# నంద్యాలలో వికలాంగ విద్యార్థులకు వసతి గృహం ఏర్పాటు చేయాలి

- ప్రజా దర్బారులో అధికారులకు వినతి



**నంద్యాల మన జనప్రగతి జూన్ 29:**-నంద్యాల పట్టణంలో వికలాంగ విద్యార్థుల కోసం ప్రత్యేక ప్రభుత్వ వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని జాతీయ బీసీల కార్యదర్శి డాక్టర్ బత్తుల సంజీవరాయుడు డిమాండ్ చేశారు. సోమవారం నిర్వహించిన ప్రజా దర్బారులో డీఆర్డీఏ ప్రాజెక్టు అధికారి శ్రీధర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నంద్యాల పట్టణంలో సుమారు వెయ్యి మంది వికలాంగ విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు,కళాశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్నారని తెలిపారు. అయితే ప్రభుత్వ ఆధ్వర్యంలో వసతి గృహం లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వసతి సౌకర్యాల కొరత కారణంగా కొందరు విద్యార్థులు మధ్యలోనే చదువును మానివేయాల్సిన పరిస్థితి నెలకొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు.కర్నూలు సీ క్యాంపులో వికలాంగుల కోసం ప్రభుత్వ వసతి గృహం విజయవంతంగా కొనసాగుతోందని, అదే తరహాలో నంద్యాలలోనూ ప్రత్యేక వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని అధికారులను కోరారు. వికలాంగ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ అంశాన్ని సానుకూలంగా పరిశీలించి త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో అరుణ వృద్ధాశ్రమం నిర్వాహకురాలు అరుణ, జీవన్ సొసైటీ అధ్యక్షుడు సుందర్ తదితరులు పాల్గొని తమ మద్దతు ప్రకటించారు.

# యోగి వేమన విశ్వవిద్యాలయంలో నేడు ముగ్గురు నాన్-టీచింగ్ ఉద్యోగుల పదవీ విరమణ




**కడప మన జనప్రగతి జూన్ 29:**-కడపలోని యోగి వేమన విశ్వవిద్యాలయంలో మంగళవారం ముగ్గురు నాన్-టీచింగ్ ఉద్యోగులు పదవీ విరమణ చేయనున్నారు. అబ్దుల్ కలాం కేంద్ర గ్రంథాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం. షబ్బీర్ అహ్మద్, సీఈ విభాగంలో ల్యాబ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎం.చెన్నారెడ్డి, అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌లో ఆఫీస్ సబార్డినేట్‌గా విధులు నిర్వహిస్తున్న కె. నరసింహులు ఉద్యోగ విరమణ చేయనున్నారు.ఈ ముగ్గురిలో కె. నరసింహులు పదవీ విరమణ ప్రత్యేకతను సంతరించుకుంది. 60 ఏళ్ల వయస్సులో 22 నెలల క్రితమే ఆయన పదవీ విరమణ చేసినప్పటికీ, ఉద్యోగాన్ని రెగ్యులర్ చేయాలని దాదాపు పదేళ్లుగా సాగించిన న్యాయపోరాటంలో కోర్టు తీర్పు అనుకూలంగా రావడంతో యూనివర్సిటీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఈ ఏడాది మే నెలలో తిరిగి విధుల్లో చేరిన నరసింహులు, 62 ఏళ్ల వయస్సు పూర్తవడంతో మరోసారి జూన్ 30న పదవీ విరమణ చేయనున్నారు.అయితే,విధులకు దూరంగా ఉన్న 22 నెలల కాలానికి సంబంధించిన వేతన బకాయిల చెల్లింపుపై యూనివర్సిటీ అధికారులు ఇప్పటికీ స్పష్టత ఇవ్వకపోవడంపై ఉద్యోగుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఆయనకు పూర్తి న్యాయం జరుగుతుందనే ఆశాభావాన్ని సహోద్యోగులు వ్యక్తం చేస్తున్నారు.జూనియర్ అసిస్టెంట్‌గా టైమ్ స్కేల్ ఉద్యోగిగా పనిచేస్తున్న ఎం. షబ్బీర్ అహ్మద్ 60 ఏళ్ల వయస్సు పూర్తవడంతో పదవీ విరమణ పొందుతున్నారు. అలాగే, ఏప్కాస్ ఉద్యోగిగా సీఈ విభాగంలో ల్యాబ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎం.చెన్నారెడ్డి కూడా పదవీ విరమణ చేయనున్నారు.ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచే ప్రతిపాదనకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపినప్పటికీ, సంబంధిత జీవో ఇంకా అమల్లోకి రాకపోవడంతో వీరిద్దరూ ప్రయోజనం పొందలేకపోయారు.ఇదిలా ఉండగా,పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగులకు యూనివర్సిటీ నిధుల నుంచి ప్రత్యేకంగా ఖర్చు చేయకుండా సాధారణంగా శాలువా,పూలమాలతో సత్కరించే ఆనవాయితీ కొనసాగుతోంది.ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం 4 గంటలకు వైస్ ఛాన్సలర్ ఛాంబర్‌లో పదవీ విరమణ పొందుతున్న ముగ్గురు ఉద్యోగులకు సన్మాన సభ నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ పద్మ ఉత్తర్వులు జారీ చేశారు

# ప్రజా సమస్యలను నాణ్యమైన పరిష్కారాలు అందించాలి

● జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ

**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూన్ 29:**-ప్రజల సమస్యల పరిష్కారంలో సంతృప్తి చెందేలా నాణ్యతతో కూడిన పరిష్కారాలను అందించాలని జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన “ప్రజా సమస్యల పరిష్కార వేదిక” కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ప్రజల నుండి వివిధ సమస్యలకు సంబంధించిన వినతులు స్వీకరించి, వాటి పరిష్కారంపై అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కారం ప్రభుత్వ యంత్రాంగం యొక్క అత్యంత ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజా




ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) ద్వారా అందుతున్న ప్రతి అర్జీని అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, నిర్ణీత సేవా ప్రమాణాల (ఎస్ఎల్ఏ) గడువులోపు నాణ్యమైన పరిష్కారం అందించాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యానికి తావివ్వకుండా, ప్రతి వినతిని బాధ్యతాయుతంగా పరిష్కరించాలని సూచించారు. అలాగే, పిటిషనర్లకు అందించే ఎండార్స్‌మెంట్‌లు స్పష్టంగా, పూర్తి వివరాలతో, సులభంగా అర్థమయ్యే విధంగా ఉండాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 46 వినతులు ఎస్ఎల్ఏ గడువు దాటిన స్థితిలో ఉన్నాయని వెల్లడించారు. వాటిలో రెవెన్యూ శాఖ పరిధిలో మంత్రాలయం 3, కౌతాళం 1, హోలగుంద 2, పెద్దకడబూరు 2, పంచాయతీరాజ్ శాఖ పరిధిలో గోనెగండ్ల ఎంపీడీవో, ఓర్వకల్లు ఎంపీడీవో కార్యాలయాలు, అలాగే ఏడీ సర్వే కార్యాలయం, సబ్ కలెక్టర్ కార్యాలయంతో పాటు ఇతర శాఖల్లో కూడా పెండింగ్ వినతులు ఉన్నాయని తెలిపారు. ఈ వినతులన్నింటినీ అత్యవసరంగా పరిష్కరించి, ఇకపై ఎలాంటి అర్జీలు బియాండ్ ఎస్-ఎల్ఏలోకి వెళ్లకుండా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శివ ప్రసాద్ రెడ్డి, అనురాధ, డి.ఆర్.డి.ఏ రమణా రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు

# ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ఐదు రోజుల్లో పూర్తి చేయాలి

ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావులేదు: జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి

**కర్నూలు మన జనప్రగతి జూన్ 29:** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియను ఐదు రోజుల్లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పీజీఆర్ఎస్, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ తదితర అంశాలపై జిల్లా, మండల స్థాయి అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రతి ఆదేశం, ప్రతి గడువును కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ పనులు సంతృప్తికరంగా పూర్తయ్యాయని, ప్రస్తుతం డిజిటైజేషన్ పనుల్లో పురోగతి మందగించిందని పేర్కొన్నారు. శనివారంలోగా మొత్తం ప్రక్రియను పూర్తి చేసి, ప్రతిరోజూ కనీసం 10 శాతం పురోగతి సాధించేలా ఆర్వోలు, ఏఈఆర్వోలు చర్యలు తీసుకోవాలని సూచించారు. బీఎల్వోలతో నిరంతరం సమీక్షలు నిర్వహించి లక్ష్యాలను చేరుకోవాలన్నారు.ప్రజలకు






మెరుగైన సేవలు అందించి సానుకూల ప్రజాభిప్రాయం పెంపొందించేలా అన్ని శాఖలు పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి శాఖ తమ పనితీరును కనీసం 10 శాతం మెరుగుపరచి ప్రజల సంతృప్తి స్థాయిని 80 శాతానికి పైగా తీసుకెళ్లేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.ఉద్యాన శాఖ సాగునీరు అందుబాటులో ఉన్న భూముల్లో ఉద్యాన పంటల విస్తరణకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని ఆదేశించారు.పీజీఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని కలెక్టర్ హెచ్చరించారు. ఫిర్యాదులను గడువులోగా నాణ్యతతో పరిష్కరించాలని, చివరి రోజుల్లో మాత్రమే కేసులు తెరిచి సంబంధం లేని ఎండార్స్‌మెంట్‌లతో మూసివేయడం సరికాదన్నారు. క్షేత్రస్థాయి పరిశీలన లేకుండా నివేదికలు సమర్పించడం, ప్రజా ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయడం వంటి చర్యలపై క్రమశిక్షణ చర్యలు తప్పవని స్పష్టం చేశారు.ప్రతిరోజూ కొత్తగా వచ్చిన ఫిర్యాదులను వెంటనే నమోదు చేసి, సంబంధిత పిటిషనర్లతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే తహసీల్దార్లు, వీఆర్వోలు తదితరులపై చర్యలకు సంబంధించిన ఫైళ్లను సిద్ధం చేసి సమర్పించాలని డీఆర్వోకు ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో సి. వెంకటనారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సునీత, అనురాధ, జిల్లా పరిషత్ సీఈఓ రమణారెడ్డి, డీఆర్డీఏ పీడీ రమణారెడ్డి, డ్వామా పీడీ నరసింహారెడ్డి, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు తదితర అధికారులు పాల్గొన్నారు.

# జూలై 1న శ్రీ సిటీలో హీరో మోటోకార్ప్ రెండో గ్లోబల్ పార్ట్స్ సెంటర్‌కు శంకుస్థాపన చేయనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి

ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి: జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్

**శ్రీసిటీ మన జనప్రగతి జూన్ 29:**- రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జూలై 1వ తేదీన శ్రీ సిటీలో హీరో మోటోకార్ప్ సంస్థ ఏర్పాటు చేయనున్న రెండో గ్లోబల్ పార్ట్స్ సెంటర్‌కు శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో విస్తృత స్థాయిలో ముందస్తు ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పి ఎల్. సుబ్బరాయుడు, జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, హీరో మోటోకార్ప్ సంస్థ ప్రతినిధులు, శ్రీ సిటీ అధికారులతో కలిసి కార్యక్రమం నిర్వహించనున్న ప్రాంగణాన్ని, హెలిపాడ్‌ను, వేదిక ఏర్పాట్లను, ముఖ్యమంత్రి రాకపోకల మార్గాలను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన అత్యంత ప్రతిష్టాత్మకమైనదని, ప్రతి శాఖ తనకు అప్పగించిన బాధ్యతలను సమయానికి పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమ నిర్వహణలో ఎలాంటి చిన్నపాటి లోపాలకు కూడా తావు లేకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి హెలికాప్టర్ ల్యాండింగ్ నుంచి కార్యక్రమం ముగిసే వరకు ప్రతి అంశాన్ని ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని, వేదిక నిర్వహణ, అతిథుల కూర్చోవడానికి ఏర్పాట్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ సరఫరా,



ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, వైద్య సేవలు, అగ్నిమాపక సిబ్బంది అందుబాటులో ఉండేలా అందరు అధికారులు సమన్వయముతో చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి అత్యున్నత స్థాయి భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నామని తెలిపారు. భద్రతా సిబ్బంది విధులను సమర్థవంతంగా నిర్వహించేలా అన్ని ప్రాంతాల్లో ముందస్తు తనిఖీలు నిర్వహిస్తున్నామని, ట్రాఫిక్ నియంత్రణతో పాటు ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తామని చెప్పారు.హీరో మోటోకార్ప్ సంస్థ ప్రతినిధులు, శ్రీ సిటీ అధికారులు కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్ల పురోగతిని జిల్లా కలెక్టర్‌కు వివరించారు. నిర్ణీత గడువులోగా అన్ని పనులు పూర్తి చేసి ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం అయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. శ్రీ సిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, అదనపు ఎస్పీలు రవి మనోహరాచారి, శ్రీనివాసరావు, ఆర్డీఓ దేవేంద్రరెడ్డి, హీరో మోటోకార్ప్ సంస్థ ప్రతినిధులు, శ్రీ సిటీ అధికారులు, జిల్లా అధికారులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# సబ్సిడీపై వేరుశనగ కాయల పంపిణీ

**తొండూరు మన జనప్రగతి జూన్ 29:**-తొండూరు మండలం మదూరు రైతు సేవా కేంద్రంలో సబ్సిడీపై వేరుశనగ కాయల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.సబ్సిడీ కోసం ముందుగా నమోదు చేసుకున్న 66 మంది రైతులకు మొత్తం 30 క్వింటాళ్ల వేరుశనగ కాయలను పంపిణీ చేసినట్లు మదూరు వ్యవసాయ సహాయకుడు (అగ్రికల్చర్ అసిస్టెంట్) హుస్సేన్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేరుశనగ కాయలు పొందిన రైతులందరూ పంట విత్తిన అనంతరం తప్పనిసరిగా పంట నమోదును పూర్తి చేయాలని సూచించారు. అలాగే ఎరువులు అవసరమైన రైతులు ఏపీఏఐఎంఎస్ యాప్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకుని పొందాలని అవగాహన కల్పించారు. రైతులు ప్రభుత్వ నిబంధనలను పాటించి సబ్సిడీ పథకాల ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
30 - 06 - 2026

# పెన్నా నదిలో యువకుడు మృతి.. తండ్రికి తీరని శోకం



**సిద్ధవటం మన జనప్రగతి జూన్ 29:**-సరదాగా ఈతకు వెళ్లిన ఓ యువకుడు పెన్నా నదిలో మృతి చెందిన ఘటన సిద్ధవటం మండలం లింగంపల్లి గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. కడప నగరం నుంచి వచ్చిన గంగాధర్, మహేంద్ర, సోమశేఖర్, వెంకటేష్, నాగేంద్ర బాబు, వెంకటసుబ్బయ్య, జగదీష్ అనే యువకులు ఆదివారం పెన్నా నది తీరానికి వెళ్లి ఈత కొడుతుండగా వారిలో గుంటూరు జిల్లా చెరువుపల్లె గ్రామానికి చెందిన జగదీష్ (26) ఊబిలో చిక్కుకుని నీటిలో కొట్టుకుపోయాడు. స్నేహితులు గమనించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. అనంతరం జగదీష్ మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. మృతుడు గత ఏడాది నుంచి కడప నగరంలోని భాగ్యనగర్ కాలనీలో ఓలో ఎలక్ట్రిక్ బైక్ షోరూమ్‌లో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. కుమారుడు మృతి చెందిన విషయం తెలుసుకున్న తండ్రి గోపి కన్నీరుమున్నీరయ్యారు. ఆదివారం మధ్యాహ్నం ఫోన్ చేసినా స్పందించకపోవడంతో, తిరిగి సాయంత్రం ఫోన్ చేయగా తన కుమారుడు పెన్నా నదిలో కొట్టుకుపోయినట్లు ఇతర యువకులు సమాచారం ఇచ్చారని తెలిపారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిద్ధవటం ఎస్సై హారిక తెలిపారు. పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు.

# బాసట చిల్డ్రన్ హోమ్‌లో రేవంత్ జన్మదిన వేడుకలు

**- విద్యార్థులకు అల్పాహారం,అన్నదానం**



**సిద్ధవటం మన జనప్రగతి జూన్ 29:**-మండలంలోని మాధవరం-1 గ్రామంలోని మనఊరికోసం స్వచ్ఛంద సేవా సంస్థకు చెందిన సభ్యుడు పాలూరు మల్లిఖార్జున తనయుడు రేవంత్ కుమార్ జన్మదినం సందర్భంగా సంస్థ ఆధ్వర్యంలో కడప శంకరాపురంలోని బాసట చిల్డ్రన్ హోమ్ లోని పిల్లలకు ఉదయం అల్పాహారం రాత్రివేళ భోజనం ఏర్పాటు చేశారు. మనఊరికోసం స్వచ్ఛంద సంస్థ చైర్మన్ అవ్వారు రవిశంకర్ మాట్లాడుతూ పాలూరు రేవంత్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని కుటుంబ సభ్యుల సహకారంతో సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. రేవంత్ ఇలాంటివి మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకుంటూ సమాజ సేవలో ముందుండాలని ఆకాంక్షించారు. మనఊరికోసం స్వచ్ఛంద సేవా సంస్థ తరఫున జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# సహకార సంఘాల అభివృద్ధి చెయ్యండి




**వీరబల్లి మన జనప్రగతి జూన్ 29:**-మండలంలోని మట్లి గ్రామం లో సోమవారం సహకార వారోత్సవాల సందర్భంగా మట్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మట్లి సహకార సంఘం అధ్యక్షుడు అప్పలనేని నాగరాజు నాయుడు సహకార పతాకాన్ని ఆవిష్కరించి, అనంతరం హాజరైన సభ్యులు, రైతులు మరియు సిబ్బందితో సహకార ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం నిర్వహించిన "రచ్చబండ" కార్యక్రమం లో సభ్యులు,రైతులు,సంఘ సిబ్బంది మరియు సహకార శాఖ సిబ్బందితో కలిసి సమావేశమయ్యారు ఈరోజు సందర్భంగా నాగరాజ నాయుడు మాట్లాడుతూ.."సహకారంతో సమృద్ధి" అనే లక్ష్యాన్ని సాధించడంలో సహకార సంఘాల పాత్ర, సంఘాల పాలకవర్గాలు,సభ్యులు మరియు రైతులు అందించాల్సిన సహకారం, బాధ్యతలు గురించి సవివరంగా, ప్రేరణాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సబ్ డివిజనల్ కోఆపరేటివ్ అధికారి హబిబుల్లా,మట్లి పి.ఏ సి యస్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి, సంఘ సిబ్బంది, సభ్యులు, రైతులు మరియు సహకార శాఖ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# దొంగతనం కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష



**సింహాద్రిపురం మన జనప్రగతి జూన్ 29:**ఇంటి తాళాలు పగలగొట్టి బంగారు ఆభరణాలు దొంగిలించిన కేసులో నిందితుడికి ఒక సంవత్సరం జైలు శిక్ష,వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ పులివెందుల జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఎం.చంద్రశేఖర్ రెడ్డి సోమవారం సంచలన తీర్పు వెలువరించారు.పోలీస్ మరియు ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కేసు వివరాలు 08.06.2025న సింహాద్రిపురం మండలం, అంకాలమ్మగూడూరు గ్రామానికి చెందిన ఏనుగుల రామ లక్షుమ్మ ఇంటి తాళాలు పగలగొట్టి,బీరువా లాకర్‌లోని 4 తులాల బంగారు చైను,2 తులాల బరువు గల మూడు జతల బంగారు కమ్మలను గుర్తుతెలియని దుండగులు దొంగిలించారు.బాధితురాలి ఫిర్యాదు మేరకు సింహాద్రిపురం పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెంబర్ 118/2025 U/Sec 331(4), 305(a) BNS కింద కేసు నమోదైంది.దర్యాప్తు చేపట్టిన పోలీసులు పులివెందుల మండలం,జు.కొత్తపల్లి గ్రామానికి చెందిన పల్లపు దివాకర్ (31) అనే నిందితుడిని అరెస్ట్ చేశారు.అతని వద్ద నుంచి రూ.3,00,000/- నగదును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. నిందితుడు రిమాండ్‌లో ఉండగానే అప్పటి సింహాద్రిపురం ఎస్ఐ హెచ్. డాక్టర్ నాయక్ కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు.ఈ కేసుపై పులివెందుల కోర్టులో విచారణ జరగగా నిందితుడిపై నేరం నిరూపితమైంది.దీంతో న్యాయమూర్తి ఎం.చంద్రశేఖర్ రెడ్డి నిందితుడు పల్లపు దివాకర్‌కు ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ.1,000/- జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు చెప్పారు.ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున బలమైన వాదనలు వినిపించిన అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.మధుసూదన ఆచారిని,కేసును పక్కాగా దర్యాప్తు చేసిన ప్రస్తుత సింహాద్రిపురం ఎస్ఐ హెచ్.డాక్టర్ నాయక్‌ను వైఎస్ఆర్ కడప జిల్లా ఎస్పీ ఎన్.విశ్వనాథ్ ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు.అలాగే,సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపరిచి నిందితుడికి శిక్ష పడేలా శ్రమించిన కోర్టు కానిస్టేబుల్ కే.కిషోర్ బాబును,కేసును నిరంతరం పర్యవేక్షించిన పులివెందుల రూరల్ సీఐ కే.శాంతి లాల్‌ను ఎస్పీ కొనియాడారు.

# సిద్ధవటం ప్రభుత్వ ఆసుపత్రికి గైనకాలజిస్ట్ నియామకానికి విజ్ఞప్తి






**సిద్ధవటం మన జనప్రగతి జూన్ 29:**-ఆంధ్రప్రదేశ్ బీజేపీ పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "జనతా వారధి" కార్యక్రమంలో భాగంగా సోమవారం కడప జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో సిద్ధవటం మండలానికి చెందిన బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిద్ధవటం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (ప్రభుత్వ ఆసుపత్రి)లో ఖాళీగా ఉన్న గైనకాలజిస్ట్ పోస్టును భర్తీ చేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. సిద్ధవటం,అట్లూరు, ఒంటిమిట్ట మండలాల పరిధిలోని పీహెచ్‌సీల నుంచి గర్భిణీలు స్కానింగ్, ప్రసవాల కోసం ఈ ఆసుపత్రికి వస్తున్నప్పటికీ గైనకాలజిస్ట్ అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని కలెక్టర్‌కు వివరించారు. స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులకు సమస్యను తెలియజేయగా, త్వరలోనే గైనకాలజిస్ట్‌ను నియమిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు శ్రీమతి పద్మావతి,కడప జిల్లా జనతా వారధి కన్వీనర్ జీ.ఎస్టీ లక్ష్మణరావు,సిద్ధవటం మండల బీజేపీ సీనియర్ నాయకులు, మండల ప్రధాన కార్యదర్శి కాకర్ల భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 30 ఏళ్ల తర్వాత ఒక్కటైన పదవతరగతి పూర్వ విద్యార్థులు

**● కొండమాచుపల్లి ఎస్ఎన్‌వైఎస్ ఉన్నత పాఠశాలలో ఘనంగా ఆత్మీయ సమ్మేళనం..గురువులకు ఘన సన్మానం**




**ఒంటిమిట్ట మన జనప్రగతి జూన్ 29:**-ఒంటిమిట్ట మండలం కొండమాచుపల్లి గ్రామంలోని ఎస్ఎన్‌వైఎస్ ఉన్నత పాఠశాలలో 199697 విద్యా సంవత్సరానికి చెందిన పదవతరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు 30 ఏళ్ల తర్వాత ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. మూడు దశాబ్దాల అనంతరం ఒకేచోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు చిన్ననాటి స్నేహాలు, పాఠశాల రోజుల మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. ప్రార్థనా గీతంతో ప్రారంభమైన కార్యక్రమంలో అప్పట్లో తమకు విద్యాబోధన చేసిన పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. పూలమాలలు, శాలువాలతో గురువులను సన్మానించి తమ జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థి దశలో నేర్చుకున్న క్రమశిక్షణ, విలువలు జీవితాంతం మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వహించాలని సూచించారు. అనంతరం పూర్వ విద్యార్థులు తమ విద్యా, ఉద్యోగ, కుటుంబ జీవిత విశేషాలను పరస్పరం పంచుకున్నారు. ఎన్నో సంవత్సరాల తర్వాత స్నేహితులను కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని, ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలు స్నేహ బంధాలను మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి సహకారంపూర్వ విద్యార్థులు తమ చదువు నేర్చుకున్న పాఠశాల అభివృద్ధికి సహకారం అందించాలని నిర్ణయించారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, విద్యా ప్రోత్సాహక కార్యక్రమాలకు తమ వంతు సహాయం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులతో పాటు రిటైర్డ్ ఉపాధ్యాయులు, ప్రస్తుత ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ముగింపులో అందరూ కలిసి భోజనం చేసి, జ్ఞాపికలు అందించుకుని, ఫొటోలు తీసుకుంటూ ఈ మధురమైన కలయికను జ్ఞాపకంగా మిగిల్చుకున్నారు.

# ఇంటింటి పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం

**● నక్కలదిన్నె వైద్యాధికారి డాక్టర్ పి.కావ్య మాధురి**



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూన్ 29:**-చాపాడు మండలంలోని నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సోమవారం నిర్వహించిన ఇంటింటి పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని వైద్యాధికారి డాక్టర్ పి. కావ్య మాధురి తెలిపారు. ఈ సందర్భంగా రాజువారిపేట,తిప్పిరెడ్డిపల్లె, ఎన్.అనంతపురం, నక్కలదిన్నె గ్రామాల్లో ఆరోగ్య విస్తరణ అధికారి ఎం. రాఘవయ్య, డిప్యూటీ హెచ్ఈఓ జయప్రకాశ్,సూపర్‌వైజర్ ప్రసాద్‌తో కలిసి పోలియో బృందాల పనితీరును పరిశీలించారు. ఆదివారం పోలియో చుక్కలు వేయించుకోలేని చిన్నారులను గుర్తించి, ఇంటింటికి వెళ్లి వారికి పోలియో చుక్కలు వేయాలని సిబ్బందికి సూచించారు. ప్రతి ఇంటిని సందర్శిస్తూ మీ చిన్నారులకు పోలియో చుక్కలు వేయించారా లేదా? అని తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. పోలియో చుక్కలు వేసిన చిన్నారుల ఎడమ చేతి చిటికెన వేలికి గుర్తు (మార్కింగ్) తప్పనిసరిగా వేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి ఎం. రాఘవయ్య, డిప్యూటీ హెచ్ఈఓ జయప్రకాశ్, సూపర్‌వైజర్ ప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సహకార వారోత్సవాల్లో ప్రతిఒక్కరూ పాల్గొనాలి

**● సింగిల్ విండో అధ్యక్షుడు దారపునేని దశరథ నాయుడు పిలుపు**



**సిద్ధవటం మన జనప్రగతి జూన్ 29:**-ప్రత్యేక సహకార వారోత్సవాలను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సింగిల్ విండో అధ్యక్షుడు దారపునేని దశరథ నాయుడు కోరారు. సిద్ధవటం కో-ఆపరేటివ్ సహకార బ్యాంకులో సోమవారం నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. వారం రోజుల పాటు జరిగే సహకార వారోత్సవాల్లో భాగంగా మొక్కలు నాటడం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవగాహన వైద్య శిబిరాలు, ఆర్థిక విజ్ఞానం, సుస్థిర సహజ అభివృద్ధి, సభ్యులకు సాంకేతిక శిక్షణ వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే ప్లాస్టిక్ నిర్మూలన, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు. రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తామని పేర్కొన్నారు. అనంతరం కో-ఆపరేటివ్ బ్యాంకు ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ బాలిరెడ్డి, ఎస్బీఎల్ సీఓ శ్రీధర్, సీనియర్ ఇన్స్పెక్టర్ అమీర్ సాహెబ్, సీఓ సుకూర్ భాష, రైతులు పాల్గొన్నారు.

# శివాలపల్లెలో శ్రీ వీరభద్ర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వైభవంగా జ్యేష్ఠ పౌర్ణమి అభిషేకాలు





**చెన్నూరు మన జనప్రగతి జూన్ 29:**-చెన్నూరు మండలం శివాలపల్లి గ్రామ సమీపంలోని జింకలవంక వద్ద వెలసిన శ్రీ వీరభద్ర లక్ష్మీనరసింహస్వామి (ఉరుకుంద ఈరన్న స్వామి) ఆలయంలో జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమి, ఏరువాక పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు వైభవంగా నిర్వహించారు.ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు భూపతి కిరణ్ కుమార్ శర్మ వేదమంత్రోచ్చారణల మధ్య స్వామివారికి పంచామృత పంచాభిషేకం నిర్వహించారు. కీర్తిశేషులు ఆదిమూలం లక్ష్మమ్మ జ్ఞాపకార్థం, ఉభయ దాతలైన ఆదిమూలం పెద్ద పుల్లయ్య కుటుంబ సభ్యులు ఈ అభిషేక సేవలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారికి పాలు, పెరుగు, నెయ్యి, పండ్లు, వస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.అభిషేకం అనంతరం స్వామివారికి వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ ఘనంగా నిర్వహించారు. జ్యేష్ఠ పౌర్ణమి, ఏరువాక పర్వదినం ఒకే రోజు రావడంతో పెద్ద సంఖ్యలో రైతులు, భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని మంచి వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని ప్రార్థించారు.ప్రముఖ కాంట్రాక్టర్ ఆధీనిమాయపల్లి ఇందిరెడ్డి శంకర్ రెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆదిమూలం పెద్ద పుల్లయ్య కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు మొక్కులు చెల్లించుకుని స్వామివారి ఆశీస్సులు పొందారు.స్వామివారిని దర్శించుకున్న భక్తులకు ఉభయ దాతలైన ఆదిమూలం పెద్ద పుల్లయ్య కుటుంబ సభ్యులతో పాటు ఆలయ వ్యవస్థాపకులు పొట్టిపాటి ప్రతాపరెడ్డి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.జ్యేష్ఠ పౌర్ణమి, ఏరువాక పర్వదినాలు ఒకేసారి రావడంతో శివాలపల్లి పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు, రైతులు ఆలయానికి తరలివచ్చి శ్రీ వీరభద్ర లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని ప్రార్థించారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు: అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్



**మదనపల్లి మన జనప్రగతి జూన్ 29:**-ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించినా సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ హెచ్చరించారు. ప్రజలకు సత్వర న్యాయం అందించడమే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.సోమవారం మదనపల్లిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వేదికలో ఎస్పీ స్వయంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులు, మహిళలు, దివ్యాంగుల నుంచి వచ్చే ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ప్రజలు జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేకుండా తమ పరిధిలోని స్థానిక పోలీస్ స్టేషన్లలోనే నిర్భయంగా ఫిర్యాదులు నమోదు చేయవచ్చని తెలిపారు. అక్కడ అందిన ఫిర్యాదులను కూడా క్షుణ్ణంగా విచారించి, చట్టపరంగా త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ ధీరజ్ వెల్లడించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యానికి తావివ్వకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులకు ఆయన సూచించారు.

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం



# జనసేన పార్టీ నిర్మాణమే తొలి ప్రాధాన్యత: బెజవాడ దినేష్

- రాజంపేట పార్లమెంటు పరిధిలో నూతన కమిటీల ఏర్పాటు
- ఆసక్తి గల నాయకులు,కార్యకర్తలు దరఖాస్తు చేసుకోవాలని పిలుపు



**పీలేరు మన జనప్రగతి జూన్ 29:-**జనసేన పార్టీని గ్రామస్థాయి నుంచి పార్లమెంటు స్థాయి వరకు మరింత బలోపేతం చేసే లక్ష్యంతో నూతన కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు జనసేన పార్టీ పీలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి బెజవాడ దినేష్ తెలిపారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. జనసేన పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ బోర్డు చైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాసులు ఆధ్వర్యంలో కమిటీల ఏర్పాటు ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు.ఈ సందర్భంగా బెజవాడ దినేష్ మాట్లాడుతూ పార్టీ నిర్మాణమే తొలి ప్రాధాన్యత అని, రాజంపేట పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాల్లో పార్టీ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేసే నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కమిటీల్లో పనిచేయడానికి ఆసక్తి ఉన్నవారు తమ పూర్తి వివరాలతో కూడిన సమ్మతి పత్రాలను రాజంపేటలోని పార్లమెంటు సెంట్రల్ కార్యాలయంలో వెంటనే సమర్పించాలని సూచించారు.పవన్ కళ్యాణ్ ఆశయాల సాధనతో పాటు కూటమి ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిబద్ధతతో పనిచేసే వారికి కమిటీల్లో ప్రాధాన్యం కల్పిస్తామని తెలిపారు.దరఖాస్తు పత్రాలు జనసేన పార్టీ పీలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి బెజవాడ దినేష్‌తో పాటు పార్లమెంటు సమాచార సేకరణ కమిటీ సభ్యులు కలప రవి, దీపాని ప్రభాకర్, పొలిమేర రెడ్డప్ప వద్ద అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కలప రవి, దీపాని ప్రభాకర్, పొలిమేర రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

# కొమ్మెర గంగాధర్ ఆరోపణలు అవాస్తవం

- లక్కిరెడ్డిపల్లి ఇంచార్జ్ సీఐ రోషన్
- గంగాధర్ పై 2023లోనే రౌడీ షీట్ నమోదు



**రాయచోటి స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూన్ 29:-**కొమ్మర గంగాధర్ చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని, అవి పూర్తిగా అవాస్తవాలని లక్కిరెడ్డిపల్లి ఇంచార్జ్ సీఐ రోషన్ స్పష్టం చేశారు. స్థానికంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు.మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కుటుంబ సభ్యులకు గానీ, ఆయన అనుచరులకు ఈ వ్యవహారంతో ఎటువంటి ప్రమేయం లేదని సీఐ తేల్చి చెప్పారు. అసలు ఆరోపణలు చేస్తున్న రాజేంద్ర రెడ్డి అనే వ్యక్తికి అక్కడ ఎలాంటి భూమీ లేదని ఆయన స్పష్టం చేశారు.పోలీసులు తనను వేధించి అక్రమంగా కేసులు నమోదు చేశారని గంగాధర్ చేసిన ఆరోపణలను సీఐ రోషన్ తీవ్రంగా ఖండించారు. వాస్తవానికి గంగాధర్ పై గతంలోనే ఐదు కేసులు ఉన్నాయని, దానికి గానూ 2023లోనే అప్పటి పోలీసు అధికారులు అతనిపై రౌడీ షీట్ నమోదు చేశారని గుర్తుచేశారు. తనపై ఉన్న కేసులను కప్పిపుచ్చుకునేందుకే పోలీసులపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. ఎవరికైనా అన్యాయం జరిగిందని భావిస్తే నేరుగా పోలీసులను ఆశ్రయించాలని, పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి బాధితులకు కచ్చితంగా న్యాయం చేస్తామని సీఐ రోషన్ ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. ఉద్దేశపూర్వకంగా అసత్య ఆరోపణలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# మల్లయ్య కొండపై తవ్వకాలు లేవు..వైసీపీ దుష్ప్రచారం చేస్తోంది: ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి



**అన్నమయ్య ప్రతినిధి మన జనప్రగతి జూన్ 29:-**మల్లయ్య కొండ,సాదుకొండ, ఇనుముకొండ ప్రాంతాల్లో ఇనుప ఖనిజాల తవ్వకాలు జరుగుతున్నాయంటూ వైసీపీ నాయకులు ప్రజల్లో అసత్య ప్రచారం చేస్తూ అపోహలు సృష్టిస్తున్నారని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు.భక్తుల విశ్వాసాలు, ప్రజల మనోభావాల పరిరక్షణే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.సోమవారం అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లి మండలం మల్లయ్య కొండపై వెలసిన శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామివారిని ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డితో పాటు రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు సుగువాసి ప్రసాద్ బాబు, మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ భాష, పలువురు ప్రజాప్రతినిధులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ...మల్లయ్య కొండ తమ ప్రాంత ప్రజలకు అత్యంత పవిత్రమైన ఆధ్యాత్మిక క్షేత్రమని, అక్కడ మైనింగ్ తవ్వకాలు జరుగుతున్నాయంటూ వైసీపీ నేతలు కావాలనే అబద్ధపు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అలాంటి తవ్వకాలు ప్రస్తుతం ఎక్కడా జరగడం లేదని, భవిష్యత్తులో కూడా భక్తుల మనోభావాలకు విఘాతం కలిగేలా ఎలాంటి చర్యలు తీసుకోబోమని స్పష్టం చేశారు.2011లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంతంలో మైనింగ్ ప్రతిపాదనలు వచ్చినప్పుడు ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా ఉద్యమం చేపట్టారని గుర్తు చేశారు. అలాంటి చంద్రబాబును విమర్శించే నైతిక హక్కు వైసీపీ నాయకులకు లేదన్నారు.2024 జనవరి 22న ఎర్రకొండలో ఇనుప ఖనిజాల తవ్వకాల కోసం టెండర్లు పిలిచింది వైసీపీ ప్రభుత్వమేనని ఆరోపించిన ఆయన, ఇప్పుడు అదే అంశంపై ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమన్నారు.కూటమి ప్రభుత్వం ప్రజల ఆస్తులను, దేవాలయాల మాన్యాలను కంటికి రెప్పలా కాపాడుతుందని, భక్తుల విశ్వాసాలను దెబ్బతీసే ఎలాంటి నిర్ణయాలు తీసుకోదని ఆయన భరోసా ఇచ్చారు. వైసీపీ నేతల తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# సేవకు చేయూత..భవన నిర్మాణానికి విరాళాల వెల్లువ

- రూ.35 వేల విరాళాలతో ముందుకొచ్చిన దాతలు
- సహకరించిన ప్రతి ఒక్కరికీ అధ్యక్షుడి ధన్యవాదాలు
- మరింత మంది దాతలు సహకరించాలని పిలుపు



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూన్ 29:-**స్నేహిత అమృత హస్తం సేవాసమితి నూతన భవన నిర్మాణానికి పలువురు దాతలు తమ వంతు ఆర్థిక సహాయాన్ని అందజేసి సేవా కార్యక్రమాలకు అండగా నిలిచారు.వేముల ఏఎస్ఐ చంద్రశేఖర్ రావు (స్వామి) కుమార్తె,అల్లుడు సుజనా – దీక్షిత్ దంపతులు రూ.10 వేల విరాళం అందజేయగా,పెద్ద జూటూరు గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు వేణుగోపాల్ రెడ్డి రూ.10 వేలు, సిరి ఫిజియోథెరపీ వైద్యుడు డాక్టర్ రమణారెడ్డి రూ.10 వేలు, వార్డు మాజీ కౌన్సిలర్ భార్గవి రెడ్డి రూ.5 వేల విరాళాన్ని సేవాసమితికి అందించారు.ఈ సందర్భంగా దాతలు నిర్మాణంలో ఉన్న సేవాసమితి భవనాన్ని సందర్శించి తమ విరాళాలను అందజేశారు.సేవాసమితి అధ్యక్షుడు మొమ్మెల రాజు మాట్లాడుతూ..భవన నిర్మాణానికి సహకరిస్తున్న ప్రతి దాతకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సమాజ సేవా కార్యక్రమాల నిర్వహణకు ఈ భవనం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.దాతల సహకారంతో భవన నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, మరిన్ని సేవాభావం కలిగిన దాతలు ముందుకు వచ్చి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు శ్రీ రాజా కళా నిలయం మాస్టర్ రాజా, రాజు తదితరులు పాల్గొన్నారు.విరాళాలు అందించిన దాతలను సేవాసమితి సభ్యులు ప్రత్యేకంగా అభినందించి కృతజ్ఞతలు తెలియజేశారు.

# భారత న్యాయవాదుల సంఘం రాయచోటి అధ్యక్షుడిగా ధనుంజయ్ కుమార్ ఏకగ్రీవ ఎన్నిక



**అన్నమయ్య ప్రతినిధి మన జనప్రగతి జూన్ 29:-**భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) రాయచోటి శాఖ అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది యు. ధనుంజయ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ విషయాన్ని ఉమ్మడి కడప జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు టి. ఈశ్వర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆర్.ఆనంద్ కుమార్ సోమవారం వెల్లడించారు.రాయచోటి కోర్టు ప్రాంగణంలో సోమవారం ఉదయం నిర్వహించిన సంఘ కార్యవర్గ సమావేశంలో న్యాయవాదుల సమస్యలు,సంఘ బలోపేతంపై విస్తృతంగా చర్చించారు.అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నూతన కార్యవర్గంలో ఉపాధ్యక్షుడిగా ఎం.చిన్నయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎం.ఖాదర్ భాష,కార్యదర్శులుగా కే.నాగేశ్వర్,వి.సిద్ధయ్య,వరలక్ష్మి,కిరణ్ కుమార్ ఎన్నికయ్యారు.కార్యవర్గ సభ్యులుగా కృష్ణయ్య, టి.వి.రమణ,డి.నాగముని,హుమయూన్ భాష,ఖుష్నుమా,జగదీష్,హరీష్,డివోక్ ఆనంద్,డి.నాగేంద్ర,శివకుమార్,ఉత్తేజ్ కుమార్, థామస్,సింటో,శిరీష,ఇర్షాద్, ఇలియాస్,బేగ్, ఇద్దైతుల్లా,జూనియర్ అజంతుల్లా తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు నాయకులు తెలిపారు.నూతన కార్యవర్గం న్యాయవాదుల హక్కుల పరిరక్షణ,వారి సమస్యల పరిష్కారం,సంఘ అభివృద్ధి కోసం సమష్టిగా కృషి చేస్తుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

# కమలాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు అధ్వాన్నం: సత్య సాయినాథ్ శర్మ

- నిర్లక్ష్యం కొనసాగితే ఆసుపత్రి ఎదుట భారీ ధర్నా చేస్తామని హెచ్చరిక



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూన్ 29:-**కమలాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు సకాలంలో వైద్య సేవలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వైఎస్సార్సీపీ రాష్ట్ర ఎస్ఈసీ సభ్యులు కాశీభట్ల సత్య సాయినాథ్ శర్మ ఆరోపించారు. సోమవారం కమలాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..కూటమి ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ ఆసుపత్రుల పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోందని విమర్శించారు.30 పడకల సామర్థ్యం కలిగిన కమలాపురం ప్రభుత్వ ఆసుపత్రి ప్రస్తుతం నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా మారిందని అన్నారు. అవసరమైన సమయంలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో రోగులు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఇటీవల కమలాపురానికి చెందిన సులోచనకు సరైన వైద్యం అందక మృతి చెందిన ఘటనపై వైద్యశాఖ నామమాత్రపు విచారణ మాత్రమే నిర్వహించి, బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఒకప్పుడు ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించి మంచి పేరు సంపాదించిన కమలాపురం ప్రభుత్వ ఆసుపత్రి నేడు దయనీయ స్థితికి చేరుకుందని పేర్కొన్నారు.ఇప్పటికైనా వైద్యులు నిర్లక్ష్యాన్ని వీడి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆసుపత్రి పరిస్థితుల్లో మార్పు రాకపోతే ప్రజలు, పార్టీ నాయకులతో కలిసి ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట భారీ ఎత్తున ధర్నా నిర్వహిస్తామని సత్య సాయినాథ్ శర్మ హెచ్చరించారు.ఈ విలేకరుల సమావేశంలో వాలంటీర్ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొప్పల కృష్ణారెడ్డి,భార్గవ్ రెడ్డి, లక్ష్మిరెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సబ్సిడీ విత్తనకాయలను రైతులు సద్వినియోగం చేసుకోండి

**- మార్కెట్ యార్డ్ చైర్మన్ డాక్టర్ ఎస్ఎండీ షఫినాయక్**



**రాయచోటి స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూన్ 29:-**ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ విత్తన కాయలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎస్ఎండీ షఫినాయక్ మండల టిడిపి అధ్యక్షుడు యనమల మదనమోహన్ పేర్కొన్నారు సోమవారం దిన్నెపాడు పంచాయతీలోని పర్వత రెడ్డి గారి పల్లెలో రైతులకు విత్తన కాయలను పంపిణీ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1900 క్వింటాళ్లు వేరుశెనగ విత్తన కాయలు మండలాలకు వచ్చాయని ప్రతి రైతు ఉపయోగించుకోవాలన్నారు మంత్రి మండపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకు వెలిగల్లు ప్రాజెక్టు కుడికాలకు నీరు అందించడం వలన ప్రతి బోరుబావిలో నీరు పుష్కలంగా ఉన్నాయని రైతులు పంటలు సాగు చేసుకోవచ్చన్నారు ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి సింగల్ బి అధ్యక్షుడు లక్ష్మి రాజు ఓబులేసు పకీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా భాగవత సప్తహ పఠనం ముగింపు

**- భక్తిశ్రద్ధలతో కలశ ప్రదర్శన**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూన్ 29:-** పులివెందుల మున్సిపాలిటీ పరిధి బ్రాహ్మణపల్లి సీతారాముల ఆలయం లో సోమవారం భాగవత సప్తహ పఠనం అంగరంగ వైభవం గా ముగిసింది.వెలిదండ్ల దేవర కోన హరిహర క్షేత్రం భాగవత భక్త సమాజం నిర్వ హానలో దాతల సహకారం తో విజయ వంతంగా సాగింది.మహిళల చే ఆలయం చుట్టూ కలశ ప్రదర్శనం నిర్వ హించారు.భాగవత పండితులు తదితరులకు ఘన సన్మానం చేశారు.అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటుచేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు.ఈ కార్యక్రమం లో శ్రీ దత్త రాజమూనింద్రా స్వామి వెంకట నారాయణరెడ్డి, నారాయణరెడ్డి, జయరామిరెడ్డిరఘురాములు,తదితరులు పాల్గొన్నారు.

# మోహిత్ రెడ్డి రాజకీయంగా మరింత ఉన్నత స్థాయికి ఎదగాలి

**- వైసిపి నేత మిట్టపల్లి జ్యోతి నాథ్ రెడ్డి**



**తిరుపతి మన జనప్రగతి జూన్ 29 :-** వైఎస్ఆర్సిపి చంద్రగిరి నియోజకవర్గ ఇన్చార్జ్, యువ నేత చెవిరెడ్డి మోహిత్ రెడ్డి రాబోయే రోజులలో రాజకీయంగా మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని తిరుపతి మండలానికి చెందిన వైఎస్ఆర్సిపి నేత మిట్టపల్లి జ్యోతి నాథ్ రెడ్డి ఆకాంక్షించారు. చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పుట్టినరోజు ను పురస్కరించుకొని సోమవారం తుమ్మలగుంటలో మోహిత్ రెడ్డిని మిట్టపల్లి జ్యోతి నాథ్ రెడ్డి, దుర్గ సముద్రం గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ మిట్టపల్లి ప్రసాద్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి లు కలసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ వెంకటేశ్వర స్వామి పద్మావతి సమేత దంపతుల ఆశీస్సులతో మోహిత్ రెడ్డి ఆయురారోగ్య సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని వారు ఆకాంక్షించారు. తండ్రి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి తగ్గ తనయుడిగా ప్రజల్లో మోహిత్ రెడ్డికి మంచి పేరు ప్రతిష్టలు ఉన్నాయని, అవి కొనసాగిస్తూ ప్రజలకు మరింత చేరువ కావాల్సిన సమయం ఆసన్నమైందని వారు తెలిపారు. వీరితోపాటు మోహిత్ రెడ్డి ని కలసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో తిరుచానూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఆదెం శంకరానందరెడ్డి కూడా ఉన్నారు.

## బూరుగడ్డ పుష్ప నగేష్‌ను కలిసిన పాస్టర్ ఫెలోషిప్ కమిటీ



**పటాన్ చెరువు మన జనప్రగతి జూన్ 29:-** నియోజకవర్గ పాస్టర్ ఫెలోషిప్ నూతన అధ్యక్షుడు సుందర్ రాజ్ ఆధ్వర్యంలోని కమిటీ సభ్యులు రామచంద్రపురం డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్ప నగేష్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.రామచంద్రారెడ్డి నగర్ కాలనీలోని నివాసంలో జరిగిన ఈ సమావేశంలో నూతన అధ్యక్షుడు సుందర్ రాజ్ తన కార్యవర్గ సభ్యులను పరిచయం చేశారు. అనంతరం బూరుగడ్డ పుష్ప నగేష్ నూతన కమిటీ సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాస్టర్లు సమాజంలో ఆధ్యాత్మిక విలువలు పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. నూతన కమిటీ ఐకమత్యంతో పనిచేసి ప్రజలకు మరింత సేవ అందించాలని ఆకాంక్షించారు. నియోజకవర్గంలోని క్రైస్తవ సంఘాల అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.అనంతరం పాస్టర్ ఫెలోషిప్ నూతన కమిటీ సభ్యులు బూరుగడ్డ పుష్ప నగేష్ దంపతులను శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో జనరల్ సెక్రటరీ అమృత్ రావు, ట్రెజరర్ జైరాజ్‌తో పాటు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. నూతన కమిటీ విజయవంతంగా పనిచేసి సమాజానికి సేవ చేయాలని పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

## గ్రామీణ వైద్యులకు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలి

**- డా. కొండిశెట్టి సురేష్ బాబు**



**విజయవాడ, మన జనప్రగతి జూన్ 29:-** ఎన్నికల సమయంలో గ్రామీణ వైద్యులకు ఇచ్చిన హామీలను ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని జాతీయ ఆర్ఎంపి, పిఎంపి సంఘాల సమైక్య అధ్యక్షులు డా. కొండిశెట్టి సురేష్ బాబు ప్రభుత్వాన్ని కోరారు.2023 అక్టోబర్ 3న మచిలీపట్నంలో జరిగిన 'జనవాణి' కార్యక్రమంలో ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గ్రామీణ వైద్యుల సమస్యలను పరిష్కరిస్తామని, శిక్షణ తరగతులను పునఃప్రారంభించి పరీక్షలు నిర్వహించి అర్హులకు సర్టిఫికేషన్ అందిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు.ఆ హామీని నమ్మి రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ వైద్యులు కూటమి విజయానికి కృషి చేశారని, అయితే హామీ ఇచ్చి 1000 రోజులు పూర్తయినా సమస్యల పరిష్కారంలో ఎలాంటి పురోగతి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఆరోగ్యశాఖ మంత్రి, ఉన్నతాధికారులకు సుమారు 500కుపైగా వినతిపత్రాలు సమర్పించినప్పటికీ స్పందన లభించలేదని తెలిపారు.గ్రామీణ వైద్యుల జీవనోపాధి, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఉప ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ ఇచ్చి, ఇచ్చిన హామీల అమలుకు చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గ్రామీణ వైద్యుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని జాతీయ ఆర్ఎంపి, పిఎంపి సంఘాల సమైక్య పక్షాన ప్రభుత్వాన్ని కోరారు.

## కాటమరాజు దేవస్థానం వద్ద బీసీ కమ్యూనిటీ హాల్‌కు రూ.32 లక్షలు మంజూరు



**పెద్దారవీడు మన జనప్రగతి జూన్ 29:-** శ్రీ కాటమరాజు గంగాభవాని దేవస్థానం వద్ద బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్ రావు యాదవ్ నిధుల నుంచి రూ.32 లక్షలు మంజూరు చేయించినందుకు యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబుకు పెద్దారవీడు మండల టీడీపీ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మండల టీడీపీ అధ్యక్షుడు మెట్టు శ్రీనివాసరెడ్డి, ఏపీఆర్‌డీసీ డైరెక్టర్ నక్కా శ్రీను, కాటమరాజు దేవస్థానం ఉపాధ్యక్షుడు గంగుల ఎల్లయ్య యాదవ్‌తో పాటు పలువురు టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## నక్కలపల్లిలో 'ఖేత్ బచావో' కార్యక్రమం

- భూసార పరీక్షలతోనే పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయి
- వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.అనిల్ కుమార్



**సింహాద్రిపురం మన జనప్రగతి జూన్ 29:** ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని పులివెందుల వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో సోమవారం నక్కలపల్లి గ్రామంలో 'ఖేత్ బచావో' (నేలను రక్షించుకుందాం) అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి వ్యవసాయ శాస్త్రవేత్తలు,అధికారులు మరియు విద్యార్థులు హాజరై రైతులకు పలు సూచనలు చేశారు.కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.అనిల్ కుమార్ మాట్లాడుతూ భూమి ఆరోగ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తుచేశారు.రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకుని,నివేదికల ఆధారంగా నిర్దేశిత మోతాదుల్లో మాత్రమే రసాయన ఎరువులు వాడుకోవాలని సూచించారు.దీనివల్ల అనవసర సాగు ఖర్చులతో పాటు వాతావరణ కాలుష్యాన్ని కూడాతగ్గించవచ్చునని పేర్కొన్నారు.రసాయన ఎరువుల వాడకాన్ని క్రమంగా తగ్గిస్తూ వర్మి కంపోస్ట్, పచ్చిరొట్టె,పశువుల ఎరువుల వంటి సేంద్రీయ ఎరువులను వాడటం వల్ల భూమిలో కర్బన శాతం (ఆర్గానిక్ కార్బన్ ) మరియు మిత్ర సూక్ష్మజీవుల సంఖ్య పెరిగి భూమి మరింత సారవంతమవుతుందని ఆయన వివరించారు. మరొక ప్రసంగీకులు డాక్టర్ కె.ఎన్.శ్రీనివాసులు మాట్లాడుతూ పంటలపై మితిమీరిన క్రిమిసంహారక మందుల వాడకం వల్ల కలిగే నష్టాలను వివరించారు.పంటలపై విషపూరిత మందుల అవశేషాలు ఉండిపోవడం వల్ల,ఆ ఉత్పత్తులను తినే మనుషులకు తీవ్ర ఆరోగ్య సమస్యలు వస్తాయని హెచ్చరించారు.అంతేకాకుండా, అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేసే సమయంలో నాణ్యతా ప్రమాణాలు లోపించి రైతులు భారీగా నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.క్రిమిసంహారక మందులకు ప్రత్యామ్నాయంగా రైతులు 'జీవ నియంత్రణ' పద్ధతులను అలవర్చుకోవాలని ఆయన కోరారు.ఈ అవగాహన కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు డాక్టర్ పి.రామాంజనేయులు,డాక్టర్ ఎ.జవహర్ రెడ్డి,వ్యవసాయ విస్తరణ అధికారి అభిలాష్,ఎంపీఓ స్వాతి,ల్యాబ్ అసిస్టెంట్ డి.రాముతో పాటు వ్యవసాయ కళాశాల విద్యార్థులు,స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అదనపు బాధ్యతలు..మరింత ఉత్సాహంతో పనిచేస్తా..

**రాయలసీమ ప్రాజెక్టుల పరిరక్షణ కమిటీలో కోఆర్డినేటర్‌గా సిబ్యాల విజయభాస్కర్.**



**రాయచోటి మన జనప్రగతి జూన్ 29:-**రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం,రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల సాధన,పరిరక్షణ లక్ష్యంగా ఏర్పాటు చేసిన రాయలసీమ ప్రాజెక్టుల పరిరక్షణ కమిటీలో కోఆర్డినేటర్‌గా రాయచోటికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి సిబ్యాల విజయభాస్కర్ నియమితులయ్యారు.ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ..తనపై నమ్మకం ఉంచి ఈ కీలక బాధ్యతలను అప్పగించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, రాజంపేట పార్లమెంట్ సభ్యుడు పి.వి. మిథున్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.రాయలసీమకు సాగునీటి హక్కుల సాధన, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల అమలు, పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పూర్తి, ప్రాంత సమగ్ర అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమంలో చురుకుగా పాల్గొని రాయలసీమ ప్రయోజనాల కోసం నిరంతరం కృషి చేస్తానని చెప్పారు.పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అప్పగించిన బాధ్యతలను నిబద్ధత, నిజాయితీతో నిర్వహిస్తానని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాయలసీమ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మరింత ఉత్సాహంతో పనిచేస్తానని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా తనకు సహకారం అందిస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలకు సిబ్యాల విజయభాస్కర్ ధన్యవాదాలు తెలిపారు.

## దేశానికి వెన్నుముక రైతన్న: ఎమ్మెల్యే కే.మురళీమోహన్

- రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- ఏరువాక పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే






**పూతలపట్టు మన జనప్రగతి జూన్ 29:-**దేశానికి వెన్నుముక రైతేనని, రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని పూతలపట్టు ఎమ్మెల్యే కే. మురళీమోహన్ అన్నారు.సోమవారం పూతలపట్టు మండలం బండపల్లిలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో, రైతు సాధికార సంస్థ సహకారంతో నిర్వహించిన ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టే రైతు గిట్టుబాటు ధరలు లేక ఇబ్బందులు పడటంఆందోళనకరమన్నారు.మార్కెట్‌లో డిమాండ్ ఉన్న, ఎగుమతులకు అనుకూలమైన పంటల సాగుతో పాటు ప్రకృతి వ్యవసాయాన్ని రైతులు ప్రోత్సహించాలని సూచించారు.రైతుల్లో అవగాహన, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై చైతన్యం పెరిగితేనే ప్రభుత్వ సహాయం, శాస్త్రవేత్తల పరిశోధనలు ఆశించిన ఫలితాలను ఇస్తాయని తెలిపారు.వాతావరణ మార్పులు, కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయాన్ని అవలంబించాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆదర్శ రైతులకు పీఎండీఎస్ విత్తనాల కిట్లు పంపిణీ చేశారు.అనంతరం నాగలి పట్టి పొలం దున్ని ఏరువాక పౌర్ణమి వేడుకలను ప్రారంభించారు. అలాగే ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాళ్లను సందర్శించి రైతులతో మమేకమయ్యారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారులు, రాస్-కేవీకే శాస్త్రవేత్తలు, ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రగతి పథంలో కాకినాడ కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్


- రూ.16.19 కోట్ల నికర లాభం..సభ్యులకు 12 శాతం డివిడెండ్
- 2040 కోట్ల టర్నోవర్‌తో రాష్ట్రంలో రెండో స్థానంలో బ్యాంక్



**కాకినాడ మన జనప్రగతి జూన్ 29:-**ఖాతాదారులకు నాణ్యమైన సేవలు అందిస్తూ ది కాకినాడ కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ ప్రగతి పథంలో దూసుకెళ్తోందని బ్యాంక్ చైర్మన్ చిట్టూరి రవీంద్ర తెలిపారు.సోమవారం స్థానిక హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బ్యాంక్ 47వ వార్షిక నివేదికను విడుదల చేసిన ఆయన, 2025-26 ఆర్థిక సంవత్సరంలో మార్చి 31 నాటికి రూ.16.19 కోట్ల నికర లాభం ఆర్జించినట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో సభ్యులకు 12 శాతం డివిడెండ్ చెల్లించేందుకు పాలకవర్గం ఆమోదం తెలిపినట్లు చెప్పారు.రాష్ట్రంలోని 16 సహకార బ్యాంకుల్లో కాకినాడ టౌన్ బ్యాంక్ రూ.2,040 కోట్ల టర్నోవర్‌తో రెండో స్థానంలో నిలిచిందన్నారు.ఈ ఏడాది వ్యాపార లక్ష్యాన్ని రూ.2,000 కోట్లుగా నిర్ణయించుకోగా, దానిని అధిగమించి రూ.2,040 కోట్ల వ్యాపారం సాధించి రిజర్వ్ బ్యాంక్ ప్రమాణాల ప్రకారం టైర్-3 బ్యాంక్‌గా స్థిరమైన గుర్తింపు పొందిందని పేర్కొన్నారు.మార్చి 31 నాటికి బ్యాంక్ డిపాజిట్లు రూ.1,235.56 కోట్లు,రుణాలు రూ.804.12 కోట్లు, పొదుపు ఖాతాల నిల్వలు రూ.552.14 కోట్లు, సొంత నిధులు రూ.198.20 కోట్లుగా నమోదయ్యాయని తెలిపారు. ఆదాయపన్ను రూ.5.60 కోట్లు చెల్లించిన అనంతరం రూ.16.19 కోట్ల నికర లాభం సాధించినట్లు వెల్లడించారు.బ్యాంకు డేటా భద్రతను మరింత బలోపేతం చేసేందుకు ఒరాకిల్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నామని, మరో 15 రోజుల్లో ఈ వ్యవస్థ అమల్లోకి వస్తుందని తెలిపారు.దీంతో సైబర్ భద్రత మరింత పటిష్ఠం అవుతుందని చెప్పారు.ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు వివిధ కమిటీలను ఏర్పాటు చేసినట్లు, ప్రధాన కార్యాలయంలో "లాకర్స్ ప్లాజా" పేరుతో నూతన భవనాన్ని నిర్మించి తక్కువ చార్జీలతో లాకర్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు.వివిధ రుణాలపై అదనపు చార్జీలు లేకుండా సేవలు అందిస్తున్నామని, మండపేటలో ఒక బ్యాంకును టేకోవర్ చేసినట్లు వెల్లడించారు. త్వరలో దీనిపై పూర్తి వివరాలు తెలియజేస్తామని పేర్కొన్నారు.ఖాతాదారుల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ బ్యాంకును మరింత అభివృద్ధి పథంలో నడిపేందుకు పాలకవర్గం సమన్వయంతో కృషి చేస్తుందని చిట్టూరి రవీంద్ర తెలిపారు.ఈ సమావేశంలో డైరెక్టర్లు మదాని హుస్సేన్ మోహిద్దీన్ ఖాన్,కంటిపూడి సత్యనారాయణ, గొల్లపూడి కృష్ణమూర్తి, గారపాటి అచ్యుత కళ్యాణ్ ప్రసాద్, సత్తి రామారెడ్డి, రిమ్మలపూడి ధర్మేంద్ర, అయ్యగారి వెంకటేష్, మల్లిపూడి శివరామ ప్రసాద్, బ్యాంక్ సీఈవో సి. సుగుణరావు తదితరులు పాల్గొన్నారు.

## ఏరువాక పౌర్ణమి రైతుకు దేవుడు ఇచ్చినవరం లాంటిది

- ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వంగమల్ల రంగారెడ్డి.



**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి జూన్ 29:-**ఏరువాక పౌర్ణమి రైతుకు దేవుడు ఇచ్చిన వరం లాంటిదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వంగమల్ల రంగారెడ్డి అన్నారు. సోమవారం అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం సంబేపల్లె మండలం దుద్యాల గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా మడకకట్టి కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. గ్రామ రైతులను ఒకచోట చేర్చి ఏరువాక పండుగను ఘనంగా జరుపుకోవడంతో పాటు రైతులను శాలువాలతో సన్మానించారు.కార్యక్రమంలో రైతు సంఘం అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వంగమల్ల రంగారెడ్డి, రాయచోటి ఏరియా ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.వారు మాట్లాడుతూ దేశానికి రైతే వెన్నెముక అని, రైతు కష్టంతోనే ప్రజలకు అన్నం అందుతుందని అన్నారు. అయితే రైతులకు తగిన గుర్తింపు, న్యాయం ఇప్పటికీ పూర్తిస్థాయిలో అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతును మరచిపోతే రాజ్యమే ఉండదని,ప్రజాప్రతినిధులు, అధికారులు రైతు సమస్యలను గుర్తించి వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.రాయచోటి ప్రాంతంలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే వేరుశెనగ,వరి,పత్తి,పొద్దుతిరుగుడు పంటలకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను రైతు భరోసా కేంద్రాల ద్వారా సకాలంలో అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.అలాగే రైతులకు 90 శాతం సబ్సిడీతో వ్యవసాయ ఇన్‌పుట్‌లను సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వెంకటరమణతో పాటు రైతులు ధనుంజయ నాయుడు,సంజీవ, రామచంద్ర, శంకర్ రెడ్డి,కిట్టయ్య,రాంబాబు,రమణ,పండు,సహదేవ రెడ్డి,సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఫుట్ బాల్ అండర్ - 14 రాష్ట్ర విజేతగా కేంబ్రిడ్జి స్కూల్ క్రీడాకారులు




**తిరుపతి మన జనప్రగతి జూన్ 29 :-** కడప జిల్లా పులివెందులలో ఈ నెల 27 28 తేదీలలో జరిగిన అండర్ 14 బాలుర ఫుట్ బాల్ పోటీలలో తిరుపతి బాలాజీ కాలనీ లోని కేంబ్రిడ్జి స్కూల్ క్రీడాకారులు విజేతగా నిలిచారు. విన్నర్ గా నిలిచిన క్రీడాకారుల జట్టుకు బంగారు పథకాలతో పాటు ప్రశంస పత్రాలను పులివెందుల సిఐ శ్రీరామ్ చేతుల మీదుగా అందజేశారు. కౌన్సిల్ ఫర్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పోటీలు మొదటిసారి కడప జిల్లా పులివెందులలోని ఇండోర్ స్టేడియంలో 27, 28 తేదీలలో జరిగాయి. ఈ పోటీలకు రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాలకు చెందిన అండర్ 14, అండర్ 19 క్రీడాకారుల బాల, బాలికల జట్లు పాల్గొన్నారు. బ్యాడ్మింటన్, ఫుట్బాల్ పోటీలను బాలబాలికల జట్లకు వేరువేరుగా నిర్వహించారు. ఈ పోటీలలో తిరుపతి క్రెమ్ బ్రిడ్జ్ స్కూలుకు చెందిన అండర్ 14 క్రీడాకారులు ఫుట్బాల్ ఆటలో ప్రత్యర్థి జిల్లా జట్టును చిత్తుచిత్తుగా ఓడించి అత్యధిక పాయింట్లు సాధించి రాష్ట్రస్థాయిలో విజేతగా నిలిచారు. బంగారు పతకం తో పాటు కప్ ను కైవసం చేసుకున్నారు. రాష్ట్ర స్థాయి పోటీలలో విజేతగా నిలచిన క్రీడాకారులు జూలై 24వ తేదీ నుండి 28వ తేదీ వరకు జమ్మూ అండ్ కాశ్మీర్ లో జరగబోయే జాతీయస్థాయి పోటీలలో పాల్గొననున్నట్లు కేంబ్రిడ్జి హై స్కూల్ కరెస్పాండెంట్ కల్పన తెలిపారు. విజేతలుగా నిలచిన క్రీడాకారులను స్కూల్ కరస్పాండెంట్ కల్పన ప్రత్యేకంగా అభినందించారు.

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా పంతు | అభివృద్ధి మా లక్ష్యం
30 - 06 - 2026

# నగరపాలక సంస్థకు 28వినతులు: కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి



**తిరుపతి మన జనప్రగతి జూన్ 29:–** నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 28 వినతులు వచ్చాయని కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయంకు నేరుగా వచ్చి 22 మంది వినతులు సమర్పించగా, ఆరు మంది ఫోన్ ద్వారా తమ సమస్యలు తెలిపారు. మునిరెడ్డి నగర్ లోని మా ఇంటి పక్కన వారు ఎటువంటి నెట్ లేకుండా నిర్మాణాలు చేస్తున్నారు ఇబ్బందిగా ఉంది, నీటి పన్ను ఎక్కువగా వస్తోంది పరిష్కరించాలని, శివజ్యోతినగర్ లో వేగ నిరోధకాలు ఏర్పాటు చేయాలని, సుబ్బారెడ్డి నగర్, శివజ్యోతి నగర్ లో త్రాగునీరు, మురుగునీరు కలసి పోతున్నాయి పరిష్కరించాలని, డ్రైనేజి కాలువలు శుభ్రం చేయాలని, ఈట్ స్ట్రీట్ నందు అక్రమంగా మాంసాహారం విక్రాయిస్తున్నారు పరిష్కరించాలని, జి.ఎస్.కే. టవర్స్ పార్కింగ్ స్థలంలో అక్రమంగా నిర్మించిన గదులు తొలగించాలని, కోటకొమ్మల వీధిలో విధ్యుత్ దీపాలు పెంచాలని, ఐ.ఎస్.మహల్ వద్ద గల తుడా అపార్ట్మెంట్ నందు కామన్ ఏరియాలో గుడి నిర్మాణన్ని ఆపాలని, న్యూ ఇందిరా నగర్ లో మురుగునీటి ప్రవాహం వలన ఇబ్బందిగా ఉంది పరిష్కరించాలని కోరారు. డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవిన్యూ అధికారులు సేతుమాదవ్, రవి, సర్వేయర్లు కోటేశ్వరరావు, గురువా రెడ్డి, ఉద్యానవన శాఖాధికారి హరికృష్ణ, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, డి.ఈ.లు, తదితరులు ఉన్నారు.

# పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులను సత్కరించిన మెట్టు కుమార్ యాదవ్



**పటాన్‌చెరువు మన జనప్రగతి జూన్ 29:–** ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో సామాజిక శాస్త్ర ఉపాధ్యాయురాలు శ్రీమతి తంగిరాల సీతాలక్ష్మి, హిందీ ఉపాధ్యాయుడు దేశ్ముఖ్ బస్వంత్ రావు పదవీ విరమణ సందర్భంగా నిర్వహించిన అభినందన సభలో పటాన్‌చెరువు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని, తమ సేవా కాలంలో అహర్నిశలు శ్రమించి వేలాది మంది విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్చిన ఉపాధ్యాయులు సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు. నేటి బాలబాలికలను రేపటి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కృషి అమూల్యమని, వారి సేవలను ఎప్పటికీ మరువలేమని అన్నారు. పదవీ విరమణ అనేది ఉద్యోగ జీవితానికి ముగింపు మాత్రమేనని, సమాజ సేవకు కొత్త ఆరంభమని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహన్, ప్రధానోపాధ్యాయురాలు స్పందన, నరసింహ, రవీంద్రాచారి, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, పలువురు ప్రజాప్రతినిధులు మరియు నాయకులు పాల్గొని పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు తమ గురువులతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు.

# దేశానికి వెన్నుముక రైతన్న

**ఏరువాక పౌర్ణమి రైతుల ఐక్యత, భారతీయ వ్యవసాయ సంస్కృతికి ప్రతీక**

**ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు అడుగులు వేయాలి: దుగ్గనపల్లి సురేంద్ర రెడ్డి**



**వీరబల్లి మన జనప్రగతి జూన్ 29:–**దేశానికి వెన్నుముక రైతేనని, రైతు సంక్షేమమే రాష్ట్రాభివృద్ధికి పునాదిగా నిలుస్తుందని అన్నమయ్య జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుగ్గనపల్లి సురేంద్ర రెడ్డి అన్నారు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ రైతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఏరువాక పౌర్ణమి భారతీయ వ్యవసాయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పండుగ అని పేర్కొన్నారు. ప్రపంచానికి ఆహారం అందించే అన్నదాత నేడు పంటలకు గిట్టుబాటు ధరలు లేక, ప్రభుత్వాల సాయం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి దురదృష్టకరమన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులకు మెరుగైన ప్రాధాన్యం లభించిందని, అనంతరం వచ్చిన ప్రభుత్వాలు రైతు సమస్యల పరిష్కారంలో ఆశించిన స్థాయిలో పనిచేయలేదని విమర్శించారు. వ్యవసాయ రంగంలో శాస్త్రవేత్తలు అందిస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మార్కెట్ డిమాండ్, ఎగుమతుల అవకాశాలు ఉన్న పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని, ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతంగా ఆచరించాల్సిన అవసరం ఉందన్నారు. కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని బీడు భూములను సైతం సాగులోకి తీసుకువచ్చి పచ్చదనాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు. రైతుల్లో అవగాహన, చైతన్యం పెరిగినప్పుడే ప్రభుత్వాల సహాయ కార్యక్రమాలు, శాస్త్రవేత్తల కృషి ఆశించిన ఫలితాలు ఇస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. చివరగా ఏరువాక పౌర్ణమి సందర్భంగా జిల్లా రైతులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

# మద్యం మత్తులో దురుసు..వార్డెన్ సస్పెన్షన్

**విద్యార్థులను దుర్భాషలాడిన ఘటనపై విచారణ: కలెక్టర్ ఆదేశాలతో శాఖ చర్య.**

**రాయచోటి స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూన్ 29:–**అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లి సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహ సంక్షేమ అధికారి (వార్డెన్) మనోహర్‌ను సస్పెండ్ చేసినట్లు శాఖ ఉన్నతాధికారులు తెలిపారు. ఈ నెల 18వ తేదీ రాత్రి భోజన సమయంలో మద్యం సేవించి విద్యార్థులను అసభ్య పదజాలంతో దుర్భాషలాడినట్లు ఆరోపణలు రావడంతో ఈ చర్యలు తీసుకున్నారు. ఘటన అనంతరం విద్యార్థులు లక్కిరెడ్డిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, సీఐ కృష్ణంరాజు నాయక్ వార్డెన్‌ను మందలించి విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మరుసటి రోజు మండల తహసీల్దార్ క్రాంతికుమార్, ఎంపీడీవో రెడ్డయ్య వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థుల నుంచి వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. దీనిపై సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు విచారణ చేపట్టగా ఆరోపణలు వాస్తవమేనని తేలింది. విచారణ నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించగా, కలెక్టర్ ఆదేశాల మేరకు వార్డెన్ మనోహర్‌ను సస్పెండ్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. గతంలో కూడా పలుమార్లు మద్యం సేవించి విద్యార్థులను దుర్భాషలాడిన ఘటనలు జరిగాయని విద్యార్థులు ఆరోపించారు.

# ప్రధాన మంత్రి వీధి వ్యాపారుల ఆత్మనిర్భర్ నిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



**తిరుపతి మన జనప్రగతి జూన్ 29:–** ప్రధాన మంత్రి వీధి వ్యాపారుల ఆత్మనిర్భర్ నిధి (PM SVANidhi) పథకాన్ని వీధి వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని మెప్మా సి.ఎం.ఎం. కృష్ణవేణి పిలుపునిచ్చారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన స్వనిధి మహోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ పథకం ద్వారా పూచీకత్తు లేకుండా రుణాలు పొందవచ్చని, తొలి విడత రూ.15,000, రెండో విడత రూ.25,000, మూడో విడత రూ.50,000 వరకు రుణ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. రుణాలను సకాలంలో చెల్లిస్తే 7 శాతం వడ్డీ రాయితీ, డిజిటల్ లావాదేవీలపై నెలకు రూ.100 వరకు క్యాష్‌బ్యాక్ లభిస్తుందని చెప్పారు. అర్హులైన వీధి వ్యాపారులకు క్రెడిట్ కార్డు సౌకర్యంతో పాటు పలు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలలో నమోదు, ఫుడ్ వెండార్లకు FSSAI సర్టిఫికెట్లు, ఈ–కామర్స్ బ్రాండింగ్ వంటి సేవలు అందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ బ్యాంక్ మేనేజర్ ప్రేమ్నా, సప్తగిరి గ్రామీణ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ అనూష, పరిశ్రమల శాఖ అధికారులు, మెప్మా సిబ్బంది, వీధి వ్యాపారులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలి

- **ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లలో చిన్నపాటి లోపాలకు తావివ్వరాదు: జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్**



**తిరుపతి రూరల్ మన జనప్రగతి జూన్ 29:–** ఓబులవారి పల్లె మండలంలోని ముక్కవారిపల్లి పంచాయతీ వద్ద జూలై 2న వికసిత్ భారత్ – గ్యారెంటీ ఫర్ రోజ్గర్ అండ్ అజీవికా మిషన్ గ్రామీణ్(వీబీజీ రాంజీ) పథకాన్ని ప్రారంభించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రానున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని, ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లలో చిన్నపాటి లోపాలకు తావివ్వరాదని సంబందిత అధికారులను జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. సోమవారం ఉదయం ఓబులవారి పల్లె మండలంలోని ముక్కవారిపల్లి పంచాయతీ వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభించానున్న కార్యక్రమానికి సంబంధించి బహిరంగ సభ, హెలిప్యాడ్ ప్రాంతాలను రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యక్రమాల కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, జిల్లా ఎస్పి ఎల్.సుబ్బరాయుడు, జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, కోడూరు శాసన సభ్యులు అరవ శ్రీధర్, కుడా చైర్మన్ ఎం.రుపానంద రెడ్డి లతో కలసి పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... వి.బి.జి.రామ్ జీ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు జూలై 2 న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రులుశివరాజ్ సింగ్ చౌహాన్, పెమ్మసాని చంద్రశేఖర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి విచ్చేయుచున్నారన్నారు. ఈ కార్యక్రమానికి సుమారు 15 నుండి 20 వేల మంది ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో వారి కోసం సీటింగ్ ఏర్పాట్లు, పార్కింగ్ ప్లేస్‌లు, టాయిలెట్స్, త్రాగు నీరు, గ్యాలరీల ఏర్పాటు చేయాలని, సభావేదిక వద్ద నిరంతర విద్యుత్, మెడికల్ క్యాంపులు తదితర ఏర్పాట్లను సంబందిత అధికారులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ ఏర్పాట్లను కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కుడా చైర్మన్ రూపానంద రెడ్డి, పంచాయతీ రాజ్ కమిషనర్ వారి టీమ్‌తో కలిసి స్వయంగా సమీక్షించారని రాబోయే రెండు రోజుల్లో మిగిలిన పనులన్నింటినీ పూర్తి స్థాయిలో చేపట్టి ఈ కార్యక్రమాన్ని అత్యంత విజయవంతం చేయడానికి కార్యచరణలను సిద్ధం చేసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ శాండల్ టాస్క్ ఫోర్స్ ఏఎస్పీ కులశేఖర్, తిరుపతి ఏఎస్పీ శ్రీనివాస్, తిరుపతి ఆర్.డి.ఓ రాం మోహన్, డ్వామా పి.డి. మద్దిలేటి, డి.పి.ఓ సుశీలా దేవి, డి.ఆర్.డి.ఎ పి.డి శోభన్ బాబు, పంచాయతీరాజ్ ఎస్ ఈ మధుసూదన్, ఆర్ & బి ఎస్.ఈ. రాజా నాయక్, విద్యుత్ శాఖ అధికారులు, ఇతర సంబందిత అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ వినతులపై జేసీ సీరియస్

- **వెంటనే పరిష్కరించి ముగించాలి**
- **ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యాన్ని సహించబోం**



**చిత్తూరు మన జనప్రగతి జూన్ 29:–**ప్రజల నుంచి అందిన వినతులను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించి వెంటనే ముగించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ వారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా మొత్తం 231 వినతులు అందాయని, వాటిలో 188 వినతులు రెవెన్యూ శాఖకు సంబంధించినవేనని తెలిపారు. రెవెన్యూ, భూ, సర్వే సమస్యలను అత్యంత ప్రాధాన్యంతో తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని, వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం లేదా జాప్యం సహించబోమని హెచ్చరించారు. అధికారులు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో వినతుల స్థితిని పరిశీలిస్తూ, పరిష్కరించిన వెంటనే వాటిని ముగించాలని సూచించారు. అర్జీదారులను స్వయంగా కలిసి వారి సమస్య తెలుసుకున్న తర్వాతే నివేదిక సమర్పించాలని, వారితో మాట్లాడిన తేదీ, సమయాన్ని కూడా నమోదు చేయాలని ఆదేశించారు. 1100 టోల్‌ఫ్రీ ద్వారా వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజల్లో ఆ సేవపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా పరిశీలించి సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా రెవెన్యూ, సర్వే శాఖకు 188, గ్రామీణాభివృద్ధి సంస్థకు 14, పోలీసు శాఖకు 6, నీటిపారుదల శాఖకు 5, పంచాయతీరాజ్, పౌర సరఫరాలు, విద్యుత్, మున్సిపల్, జలవనరులు, మహిళా అభివృద్ధి శాఖలకు రెండేసి, పశుసంవర్ధక, దేవాదాయ, అగ్నిమాపక, ఉద్యానవన, ఉపాధి, గృహ నిర్మాణ శాఖలకు ఒక్కో వినతి అందినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్‌కుమార్, సహాయ కలెక్టర్ వెంకటేష్, రెవెన్యూ డివిజనల్ అధికారులు శ్రీనివాసులు నాయుడు, విజయలక్ష్మి, డిప్యూటీ

## ఈ జేష్ట ఏరువాక పౌర్ణమి కావడంతో పుష్పగిరి గిరి ప్రదర్శనకు పోటెత్తిన భక్తులు

**- ఆంజనేయ స్వామి జండాలతో గిరి ప్రదర్శన**



**చెన్నూరు మన జనప్రగతి జూన్ 29:–**ఈ జేష్ట ఏరువాక పౌర్ణమి కావడంతో సోమవారం ఉదయం పుష్పగిరి గిరి ప్రదర్శనకు భక్తులు పోటెత్తారు. ఉదయం ఐదు గంటలకే గిరి ప్రదర్శన చేయడానికి వివిధ గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఉదయం భక్తులకు దాతలు కృష్ణమూర్తి విజయ్ రెడ్డి రామ సుబ్బారెడ్డి కొండారెడ్డిలో భక్తులకు ఆంజనేయ స్వామి 500 జెండాలు అందజేశారు. గిరి ప్రదర్శన అధ్యక్షుడు ఆవుల బసిరెడ్డి దాతలు పూజలు నిర్వహించి గిరి ప్రదర్శన నిర్వహించారు. భక్తులు ఆంజనేయ స్వామి జెండాలు చేత పట్టుకొని గిరి ప్రదర్శన నిర్వహించారు. భక్తులకు దాతల సాయంతో ప్రసాద వితరణ త్రాగునీటి సౌకర్యం భక్తులతో ఏర్పాటు చేశారు. చెన్నూరు నుంచి గిరి ప్రదర్శనకు వెళ్లే భక్తులకు గిరి ప్రదర్శన అధ్యక్షుడు ఆవుల బసిరెడ్డి ఉచిత వాహనం ఏర్పాటు చేశారు. గిరి ప్రదర్శనకు వచ్చిన భక్తులు శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి. శివాలయం వివిధ ఆలయాలను భక్తులు దర్శించుకున్నారు.

## పౌర్ణమి వేళ శ్రీ అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా ప్రత్యేక పూజలు



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూన్ 29:–**పౌర్ణమి శుభదినాన్ని పురస్కరించుకుని ప్రొద్దుటూరులోని శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం భక్తిశ్రద్ధల నడుమ ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. ఉదయం 6 గంటలకు గోపూజతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం వేద మంత్రోచ్చారణల మధ్య చండీ మహా హోమం ఘనంగా జరిగింది. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో స్వామి, అమ్మవార్ల మిరవరి (ఉత్సవ విహారం) నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి అమ్మవార్ల దివ్య దర్శనం పొందారు. ఈ కార్యక్రమాలు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.వి. రమణ, ఆలయ చైర్మన్ వంగల నారాయణ రెడ్డి, పాలక మండలి సభ్యుల పర్యవేక్షణలో, ఆలయ అర్చక స్వాముల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పౌర్ణమి సందర్భంగా ఆలయమంతా ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది.

## రాయలసీమ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడమే లక్ష్యం

**- 16350 కోట్ల పెట్టుబడితో కడప స్టీల్ ప్లాంట్ కు శంకుస్థాపన చేయనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు: ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూన్ 29:**రాయలసీమ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడమే లక్ష్యంగా 16,350 కోట్ల పెట్టుబడితో కడప స్టీల్ ప్లాంట్ కు ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేయనున్నారని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం విజయవాడలోని తెదేపా కేంద్ర కార్యాలయం నందు ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాయలసీమ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు విభజన చట్టంలో గల విభజన చట్టంలో ఉన్న నిర్మాణాన్ని సహకారం చేయడానికి గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు సారధ్యంలో జూలై మూడవ తారీకు శంకుస్థాపన చేయనున్నారని, దాదాపు 16,350 కోట్ల పెట్టుబడి తో సంవత్సరానికి మూడు మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్ధ్యంతో శంకుస్థాపన కావించి 2028లో ఉత్పత్తిని ప్రారంభించే ఆలోచనలో భాగంగా మూడవ తేదీన మొదలుపెట్టనున్నారని ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా జేఎస్డబ్ల్యు సంస్థ ఇప్పటికే ప్రాథమిక పనులను పూర్తి చేయడం జరిగిందని మరియు ఇతర కార్యక్రమాలు కూడా వేగవంతంగా జరుగుతున్నాయని, అనేక దశాబ్దాలుగా కడప జిల్లా ప్రజలు ఉక్కు కర్మాగారం కొరకు ఆందోళన చేయడం జరిగిందని అనేక రకాలుగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మీద ఒత్తిడి తేవడం జరిగిందని వారి పోరాటాలకు ప్రతిఫలంగా ఉక్కు కర్మాగారం శంకుస్థాపన మంచి పరిణామమని తెలియజేశారు.

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక

30 - 06 - 2026

# గ్రామస్థాయి నుంచే జనసేనను బలోపేతం చేయాలి: పప్పిరెడ్డి మహేశ్వర్ రెడ్డి

● పార్టీ నిర్మాణ సారథుల దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం



**అన్నమయ్య ప్రతినిధి మన జనప్రగతి జూన్ 29:-** గ్రామస్థాయి నుంచి జనసేన పార్టీని మరింత బలోపేతం చేయాలని జనసేన పార్టీ రాయచోటి నియోజకవర్గ నాయకుడు పప్పిరెడ్డి మహేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కార్యక్రమంలో భాగంగా సోమవారం రాయచోటి నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ...పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని గ్రామ స్థాయి నుంచి పార్లమెంట్ స్థాయి వరకు పటిష్టం చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. రాజంపేట పార్లమెంట్ పరిధిలో పార్టీ నిర్మాణానికి సంబంధించి నాయకులు, కార్యకర్తలకు అవగాహన కల్పించేందుకు పార్టీ ప్రతినిధి శ్రీనివాసరావు మార్గనిర్దేశం చేశారని తెలిపారు. రాయచోటి నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి సేవలందిస్తున్న నాయకులు, కార్యకర్తలతో పాటు మధ్యలో పార్టీలో చేరి కృషి చేస్తున్న వారు కూడా పార్టీ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. పార్టీ పదవులపై ఆసక్తి ఉన్న నాయకులు, కార్యకర్తలు గ్రామపంచాయతీ, మండల, నియోజకవర్గ, పార్లమెంట్ స్థాయిల్లో బాధ్యతలు చేపట్టేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు నిమ్మనపల్లి పవన్ కుమార్, బుడ్డా నాగభూషణం, పద్మావతి, కొండ, వేల్పుల వీరేంద్ర, రెడ్డి ప్రసాద్ నాయుడు, సంజీవ, వెంకటేష్, బుల్లెట్ విజయ్, నరసింహులు, బాలాజీ, నాగేంద్రతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆక్వా రంగానికి పూర్వ వైభవం తెస్తాం

## ప్రతి ఆక్వా రైతుకు రూ.1.50కే నాణ్యమైన విద్యుత్: మంత్రి అచ్చెన్నాయుడు



**కాకినాడ మన జనప్రగతి జూన్ 29:** రాష్ట్రంలో ఆక్వా రంగాన్ని తిరిగి గాడిలో పెట్టి పూర్వ వైభవం తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయం, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక, పాడిపరిశ్రమల అభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఇచ్చిన హామీ మేరకు జోన్లతో సంబంధం లేకుండా ప్రతి ఆక్వా రైతుకు యూనిట్ విద్యుత్‌ను కేవలం రూ. 1.50కే అందిస్తున్నామని, ఇందుకోసం ప్రభుత్వం ఏటా రూ. 1,180 కోట్లు వ్యయం చేస్తోందని వెల్లడించారు. సోమవారం కాకినాడలోని ఎస్ఆర్ఎంటీ ఫంక్షన్ హాలులో ఆలిండియా ష్రింప్ హాచరీస్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ హాచరీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని 'హాచ్ ఇండియా ఇంపెండియం2026' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో టీడీపీ ప్రభుత్వం ఆక్వా రైతులకు రూ. 2కే విద్యుత్ అందించే పథకాన్ని ప్రారంభించిందని గుర్తు చేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం జోన్‌నాన్ జోన్ విధానం, అనేక నిబంధనలతో రాయితీ విద్యుత్ ప్రయోజనాలను పరిమితం చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి రైతుకు రూ. 1.50కే విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. ఆక్వా సాగుపై పూర్తి సమాచారం కోసం మాత్రమే రిజిస్ట్రేషన్ విధానాన్ని అమలు చేస్తున్నామని, దీనికి ఎలాంటి రుసుము లేదని, నమోదు పూర్తయిన వెంటనే రాయితీ విద్యుత్ అందజేస్తున్నామని చెప్పారు. దేశంలో ఉన్న 550 హాచరీల్లో 450 హాచరీలు ఆంధ్రప్రదేశ్‌లోనే ఉండటం రాష్ట్ర ఆక్వా రంగ బలాన్ని సూచిస్తోందని పేర్కొన్నారు. 2027 నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తయితే ఆక్వా సాగు, హాచరీలకు అవసరమైన నీటి కొరత ఉండదని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. హాచరీ నిర్వాహకులు, ఫీడ్ తయారీదారులు, ఎగుమతిదారులు, రైతులు పరస్పర సహకారంతో ముందుకు సాగితేనే ఆక్వా రంగం మరింత అభివృద్ధి చెందుతుందని సూచించారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ అధికారులు, అసోసియేషన్ ప్రతినిధులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి ప్రతి నెలా రెండు సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో హాచరీల ప్రతినిధులు వ్యవసాయ అనుబంధ రంగాల మాదిరిగా హాచరీలకు కూడా రాయితీలు, ప్రోత్సాహకాలు కల్పించాలని, ప్రస్తుతం ఆక్వా రైతులకు అందిస్తున్న రూ. 1.50 విద్యుత్ రాయితీని హాచరీలకు కూడా వర్తింపజేయాలని మంత్రిని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన అచ్చెన్నాయుడు, అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బీరా మస్తాన్‌రావు, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖరం, కర్రి పద్మశ్రీ, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, ఆక్వా రంగ ప్రతినిధులు, హాచరీ నిర్వాహకులు, నిపుణులు తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యతే ప్రామాణికంగా..పిజిఆర్ఎస్ సమస్యలను పరిష్కరించి ప్రజలకు భరోసా కల్పించాలి

**- జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ**



**మదనపల్లి మన జనప్రగతి జూన్ 29:-** ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను కేవలం డిస్పోజ్ చేయడానికే పరిమితం కాకుండా, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నాణ్యతతో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, ప్రతి అర్జీపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి పారదర్శకంగా పరిష్కరించాలని సూచించారు. పెండింగ్, బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్ కేసులకు తావులేకుండా నిర్ణీత గడువులోగా అర్జీలను పరిష్కరించాలని అధికారులకు స్పష్టం చేశారు. కార్యక్రమంలో మొత్తం 332 అర్జీలు అందగా, వాటిని సంబంధిత శాఖల అధికారులకు పరిష్కారం కోసం ఎండార్స్ చేశారు. ప్రధాన వినతులు.. బీకేపల్లి గ్రామానికి చెందిన వై. రామక్క తనకు ఇంటి స్థలం, గృహం మంజూరు చేయాలని కోరగా, నిమ్మనపల్లె మండలం బండ్లబాయి కాలనీకి చెందిన దివ్యాంగుడు మేకల కిష్టప్ప విద్యుత్ మోటార్‌తో కూడిన దివ్యాంగుల వాహనం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కురబలకోట మండలం తట్టేవారిపల్లికి చెందిన జి. అమరావతి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థిక సాయం, వితంతు పెన్షన్ మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్‌డీసీ మాధవ కృష్ణారెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# సోమేశ్వర స్వామి దేవస్థానానికి కొత్త కమిటీ

● చైర్మన్‌గా మాదినేని బాలకృష్ణ ప్రమాణస్వీకారం

● ఆలయ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి: ఎమ్మెల్యే మాధవి



**కడప మన జనప్రగతి జూన్ 29:-** దేవుని కడపలోని శ్రీ సోమేశ్వర స్వామి దేవస్థానం నూతన చైర్మన్, పాలక మండలి సభ్యులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. దేవస్థానం ఈవో ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చైర్మన్‌గా మాదినేని బాలకృష్ణ, సభ్యులుగా గోపవరం పార్వతమ్మ, సి. శాంతమ్మ, ఆర్. వసంత, యు. సుశీల, ఎన్. సుబ్బరాయుడు, జి. పోతురాజు, పి. గంగరాజు, ఎస్. శివ సత్యకుమార్ ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ దేవుని కడప ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. నిధుల కొరత ఉన్నప్పటికీ అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని చెప్పారు. అన్ని వర్గాలకు సముచిత ప్రాధాన్యం కల్పిస్తున్నామని, మృత్యుంజయకుంట శివాలయానికి టీటీడీ ద్వారా నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. పురాతన సోమేశ్వర స్వామి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయడంలో నూతన కమిటీ అంకితభావంతో పనిచేయాలని సూచించారు. జోనల్ కోఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ..భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనతో పాటు ఆలయ అభివృద్ధిని వేగవంతం చేయడమే కమిటీ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు చైర్మన్ తోట వెంకటసుబ్బయ్య, డైరెక్టర్ ఆకుల గోపి, మృత్యుంజయకుంట శివాలయం చైర్మన్ నాగేశ్వరరావు, పాలకొండ శివాలయం చైర్మన్ రెడ్డయ్య యాదవ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# కోర్టు ఉత్తర్వులు బేఖాతరు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది..!





**చక్రాల వృద్ధ రైతు దంపతుల భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని వినతి**

**కోర్టు ఇంజంక్షన్ ఉన్నా రికార్డుల్లో మార్పులు చేశారని ఆరోపణ..**

**ఓ పత్రిక విలేఖరి భార్య గొల్ల రత్నమ్మకు**

**మార్చిన రెవెన్యూ సిబ్బంది వైనం**

**న్యాయం చేయకపోతే ఆత్మహత్య శరణ్యం**

**పత్తికొండ మన జనప్రగతి జూన్ 29:-** పత్తికొండ మండలం చక్రాల గ్రామానికి చెందిన రైతు దంపతులు నడిపి రాముడు, నడిపి వెంకమ్మ తమకు చెందిన వ్యవసాయ భూమిని అక్రమంగా ఇతరుల పేరుపై ఆన్‌లైన్‌లో నమోదు చేశారని, దీన్ని మార్చాలని ఎన్నిసార్లు అధికారుల చుట్టూ తిరిగిన అధికారులకు కనికరము కలిగించడం లేదని చివరకు ఆత్మహత్య శరణ్యం అని రైతు వృద్ధ దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. చేసిన తప్పును ఒకరంటే ఒకరు మీద చెప్పుకుంటూ కాలయాపన చేస్తూ నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. అధికారులను నిర్లక్ష్యాన్ని ఆరోపిస్తూ సోమవారం పత్తికొండ తహసీల్దార్ హుస్సేన్ సాహెబ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కోర్టు ఇంజంక్షన్ ఉత్తర్వులు అమల్లో ఉన్నప్పటికీ రెవెన్యూ అధికారులు వాటిని పరిగణనలోకి తీసుకోకుండా వ్యవహరిస్తున్నారని, తమకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి..పత్తికొండ మండలం చక్రాల గ్రామంలోని సర్వే నంబర్39, పట్టా నంబర్909 పరిధిలోని ఒక ఎకరం వ్యవసాయ భూమి తమ పూర్వీకుల నుంచి సంక్రమించిందని తెలిపారు. అయితే తమ బంధువు రెవెన్యూ రికార్డుల్లో అక్రమ మార్పులు చేయించి ఆ భూమిని తన పేరుపై ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకున్నాడని ఆరోపించా రు. ఈ విషయమై పలుమార్లు గ్రామ, మండల స్థాయి రెవెన్యూ అధికారులను కలిసి వినతులు ఇచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ప్రతి సారి విచారణ పేరుతో కాలయాపన చేశారని వాపోయారు. న్యాయం కోసం చివరకు పత్తికొండ సివిల్ కోర్టును ఆశ్రయించామని, ఓఎస్ నెం. 242/2023, ఐఏ నెం. 499/2023 కేసుల్లో విచారణ అనంతరం 2023 జూలై 3న కోర్టు ఇంజంక్షన్ ఉత్తర్వులు జారీ అయ్యాయని తెలిపారు. కోర్టు స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ వాటిని అమలు చేయకుండా తమ భూమి రికార్డుల్లో మార్పులు కొనసాగించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. కోర్టు ఉత్తర్వులను సైతం పట్టించుకోకుండా వ్యవహరించడం చట్టాన్ని ధిక్కరించడమేనని ఆరోపించారు. అంతేకాకుండా, ఇదే సర్వే నంబర్‌కు సంబంధించి గతంలో గొల్ల ఎంకమ్మ, గొల్ల రత్నమ్మ పేర్లతో కూడా రెవెన్యూ రికార్డుల్లో మార్పులు జరిగాయని, దీనిపై కూడా వివాదం కొనసాగుతోందని అన్నారు. భూ రికార్డుల్లో జరిగిన మార్పులపై సమగ్ర విచారణ నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. తమ భూమిపై అక్రమంగా నమోదు చేసిన పేరును వెంటనే తొలగిం చి, తమ పేరుపై ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు కోర్టు ఉత్తర్వులను తక్షణమే అమలు చేయాలని నడిపి రాముడు, నడిపి వెంకమ్మ దంపతులు తహసీల్దార్‌ను కోరారు. తమ సమస్యను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కుటుంబ సమేతంగా రెవెన్యూ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగుతా మని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఈ ఆరోపణలపై రెవెన్యూ శాఖ అధికారుల స్పందించాల్సి ఉంది.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174